RNI No. APTEL/2012/53127

TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 | సంచిక: 26 | ఎడిటర్ : జేరిపోతుల సంపత్, కరీంనగర్ | గురువారం 30-4-2026 | పేజీలు: 8 | వెల: రూ. 2.00

తెలంగాణ వాణి

R N I No. APTEL/2012/53127

విలేకరులు కావలెను

తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

9182328292

## కేసీఆర్‌ను కవిత విమర్శించడం బాధేసింది

- కవిత కొత్త పార్టీపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కామెంట్స్
- కేసీఆర్‌ను కవిత విమర్శించడం బాధించిందని వెల్లడి
- తండ్రిని విమర్శించి మర్యాదను కోల్పోయారని విమర్శలు



**హైదరాబాద్** కల్వకుంట్ల కవిత కొత్తగా పెట్టిన తెలంగాణ రాష్ట్ర సేన పార్టీపై మునుగోడు ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆసక్తికర కామెంట్స్ చేశారు. కేసీఆర్ లాంటి ఉద్యమ నాయకుడిని పట్టుకుని పార్టీ ఆవిర్భావ సభలోనే కవిత చేసిన విమర్శలు సరికావని రాజగోపాల్ రెడ్డి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కవిత నూతన పార్టీ ఏర్పాటుపై స్పందించిన

2లో..



## హైదరాబాద్ మెట్రో రైలు ప్రభుత్వపరం



### ఈ విలీన ప్రక్రియ వెనుక వ్యూహం ఇదేనా.?

**హైదరాబాద్** హైదరాబాద్ మెట్రో విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు ఎల్ అండ్ టీ ఆధీనంలో ఉన్న మెట్రో రైలును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-1ను హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ ద్వారా స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే నిర్ణయించింది. ఈ మేరకు ఎల్అండ్‌టీతో కొద్ది రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు నిర్వహించింది. ఈ నేపథ్యంలో హెచ్ఎంఆర్ఎల్ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, మెట్రోపాలిటన్ ఏరియా, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, హెచ్ఎంఆర్ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, ఎల్‌డటీ, ఎల్టీఎంఆర్హెచ్ఎల్ ప్రతినిధులు బుధవారం రాష్ట్ర సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో లార్సెన్ అండ్ టౌబ్రో లిమిటెడ్,ఎల్ అండ్ టీ మెట్రో రైల్ లిమిటెడ్ సంస్థలతో షేర్ల కొనుగోలు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం ఎల్టీఎంఆర్హెచ్ఎల్కు ఉన్న వంద శాతం షేర్లను రూ.1,461.47 కోట్ల ఈక్విటీ విలువకు ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఒప్పందంపై హెచ్ఎంఆర్ఎల్ తరఫున ఎండీ సర్ఫరాజ్ అహ్మద్,ఎల్ అండ్ టీ లిమిటెడ్ తరఫున డి.కె.సేన్, ఎల్టీఎంఆర్హెచ్ఎల్ తరఫున కేవీబీ రెడ్డి సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం ఎల్ అండ్ టీ హామీతో ఎల్టీఎంఆర్హెచ్ఎల్ పై ఉన్న రూ. 13,538.53 కోట్ల అప్పును (2026, ఏప్రిల్ 30వ తేదీ నాటికి) తెలంగాణ ప్రభుత్వం హామీతో రీఫైనాన్స్ చేస్తారు. ఈ లావాదేవీకి ట్రాన్సాక్షన్ అడ్వైజర్‌గా ఐడీబీఐ కాపిటల్ వ్యవహరించగా, లీగల్ అడ్వైజరీ సేవలను సరాఫ్ ఒ పార్టనర్స్ సంస్థ అందించింది. హైదరాబాద్‌లో ఎల్అండ్‌టీ మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ సంస్థ 2017, నవంబర్ నుంచి మూడు కారిడార్లలో మొత్తం 69 కిలోమీటర్ల నెట్‌వర్క్‌తో హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్--1ను నిర్వహిస్తోంది. మెట్రోలో ప్రస్తుతం రోజుకు సుమారు 4.50 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. మెట్రో ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు సుమారు 86 కోట్ల ప్రయాణాలు నమోదయ్యాయి. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్--1ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతో ఫేజ్--1, ప్రతిపాదిత ఫేజ్--2 నెట్‌వర్క్ రూపకల్పన, పనులు, ప్రణాళిక, అమలు, సేవల అందజేతలో సమన్వయం సాధ్యమవుతుంది. భవిష్యత్‌లోనూ హైదరాబాద్ నగరానికి మరింత సమగ్ర, ఆధారపడదగిన, ప్రయాణికులకు అనుకూలమైన మెట్రో రైలు నెట్‌వర్క్ ఏర్పడుతుందని రాష్ట్ర ప్రభుత్వం

2లో..

## బెంగళూరులో వర్ష బీభత్సం

- ఆసుపత్రి గోడ కూలి 7 మంది మృతి



**బెంగళూరు** దేశ ఐటీ రాజధాని బెంగళూరు నగరంలో బుధవారం భారీ వర్షం బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులు, పిడుగులతో కురిసిన ఈ వర్షం జనాలను వణికించింది. అకాల వర్షానికి 8 మంది ప్రాణాలు కోల్పోయారు. బెంగళూరులోని బౌరింగ్, లేడీ కర్జాన్ ఆసుపత్రి సమీపంలో ప్రహరీ గోడ కూలిన ఘటనలో ముగ్గురు చిన్నారుల సహా ఏడుగురు ఘటనాస్థలిలోనే మృతి చెందినట్టు అధికారులు తెలిపారు. ఘటన గురించి సమాచారం తెలియగానే కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అక్కడకు చేరుకున్నారు. బౌరింగ్ ఆసుపత్రి ప్రాంగణం సమీపంలో జరిగిన గోడ కూలిన ఘోరమైన ఘటనలో ఏడుగురు మరణించినట్లు సీఎంఓ ధ్రువీకరించింది. బాధిత కుటుంబాలకు సీఎం సిద్ధూ ఆర్థిక సాయం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షలు ప్రభుత్వం తరఫున అందజేయనున్నట్టు సీఎం తెలిపారు. భారీ వర్షాలు, బలమైన గాలులు, వడగళ్ల వాన ఆ ప్రాంతాన్ని ముంచెత్తింది. ఆ సమయంలో ఏడుగురు బాధితులు గోడ దగ్గర తలదాచుకుంటుండగా అది అకస్మాత్తుగా కూలిపోయింది.పోలీసులు, అత్యవసర సేవల సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, స్థానికుల సహాయంతో శిథిలాల నుంచి మృతదేహాలను గాయపడిన వారిని బయటకు తీశారు. ఈ ఘటన గురించి సమాచారం అందిన వెంటనే తాను సంఘటనా స్థలానికి బయలుదేరినట్లు డిప్యూటీ ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. "పోలీస్ కమిషనర్‌తో మాట్లాడాను వెంటనే సంఘటనా స్థలానికి వెళ్తున్నాను. బాధితులకు వీలైనంత వరకూ సాయం చేస్తాం" అని ఆయన విలేకరులతో అన్నారు. బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసి, జనజీవనం అస్తవ్యస్తమైంది. అత్యధికంగా కాటన్‌పేట్‌లో 77.5 మి.మీ. వర్షపాతం నమోదయ్యింది. తర్వాత చామరాజ్‌పేట్ 77.0 మి.మీ., పులకేశినగర్ 62.0 మి.మీ., విశ్వేశ్వరపురం 60.5 మి.మీ.లలో వర్షపాతం కురిసింది. నేరిగ (55.0 మి.మీ.), రాజమహల్ గుట్టహళ్లి (54.0 మి.మీ.), బీటీఎం లేఅవుట్

2లో..

## తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మాణం చేపట్టే కార్యాచరణ వేగవంతం చేయాలి

- కేంద్రంపై కిషన్ రెడ్డి ఒత్తిడి పెంచాలన్న సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్** తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణం చేపట్టే కార్యాచరణ వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఎంసీహెచ్ఆర్డీలో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తుమ్మడిహెట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణంపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ వేం నరేందర్ రెడ్డితోపాటు నీటి పారుదల శాఖకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు.తుమ్మడిహెట్టి బ్యారేజ్‌ని ఎంత ఎత్తున నిర్మించాలి ఎంత

2లో..

## ఎన్నికలకు ముందు దానవీరశూరకర్ణ, ఎన్నికల తర్వాత కుంభకర్ణ

### - సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

- రేవంత్ రెడ్డి తాను మారిన మనిషినని చెబుతున్నారన్న కేటీఆర్
- ఎన్నికల తర్వాత కుంభకర్ణుడయ్యాడు కాబట్టి ఆయన చెప్పింది నిజమేనని చురక
- ఈ దుర్మార్గపు పాలనను మరొక్క సంవత్సరం తట్టుకోవాలన్న కేటీఆర్




**హైదరాబాద్** తాను మారిన మనిషినని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నారని, అయితే ఆయన చెప్పినదాంట్లో నిజం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎన్నికలకు ముందు ఆయన దానవీరశూరకర్ణ అయితే, ఎన్నికల తర్వాత కుంభకర్ణుడు అయ్యాడని ఎద్దేవా చేశారు. కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీలకు నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు ఆయన పాలమూరు బిడ్డ, ఇప్పుడు కనీసం పాలమూరు ప్రాజెక్టును పట్టించుకోని బిడ్డ అని ఎద్దేవా చేశారు. నాగర్ కర్నూలు, పాలమూరులలోనే రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తుంటే సిగ్గనిపించడం లేదా అని మండిపడ్డారు. విద్యుత్ ఇవ్వడం లేదని, గురుకులాల్లో విద్యార్థులు చనిపోతున్నారని, రైతు బంధు ఖాతాల్లో పడటం లేదని, వీటికి ఆయనకు సిగ్గనిపించడం లేదా అని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నాయకులు తిడుతుంటే తనకు పైశాచిక ఆనందం వస్తుందని రేవంత్ రెడ్డి చెబుతుంటే విడ్డూరంగా ఉందని అన్నారు.

బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తమ గ్రామాలు, మండలాల్లో ఉండే సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు. మరో సంవత్సరం తర్వాత రేవంత్ రెడ్డి చెబితే, కూర్చున్న కుక్క కూడా లేవదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ దుర్మార్గపు, అరాచకపు పాలనను మరొక్క సంవత్సరం తట్టుకుంటే, చివరి ఏడాది అంతా ఎన్నికల హడావుడి ఉంటుందని అన్నారు.

## ఉత్కంఠ రేపుతున్న ఎగ్జిట్ పోల్స్

- బెంగాల్‌లో హోరాహోరీ
- తమిళనాడులో డీఎంకేకు మొగ్గు - కేరళలో ఉత్కంఠ



**న్యూఢిల్లీ** దేశవ్యాప్తంగా ఆసక్తి రేపిన కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగియడంతో, పలు జాతీయ సర్వే సంస్థలు తమ ఎగ్జిట్ పోల్స్ అంచనాలను విడుదల చేశాయి. ఈ అంచనాలు మిశ్రమ ఫలితాలను సూచిస్తున్నాయి. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో నువ్వానేనా అన్నట్టు పోటీ ఉండగా, తమిళనాడులో డీఎంకే కూటమి వైపు మొగ్గు కనిపిస్తోంది. కేరళలోనూ హోరాహోరీ పోరు తప్పదని సర్వేలు చెబుతున్నాయి.దతమిళనాడులో డీఎంకే కూటమి మరోసారి అధికారం చేపట్టే అవకాశాలున్నాయని చాలా సర్వేలు అంచనా వేశాయి. అయితే, నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ గణనీయమైన ఓట్లను సాధించి, రాజకీయాల్లో కీలక శక్తిగా అవతరించినట్లు తెలుస్తోంది.పీపుల్స్ పల్స్: డీఎంకే కూటమి 125-145, అన్నాడీఎంకే కూటమి 65-80, టీవీకే 18-24. మ్యాట్రిజ్: డీఎంకే కూటమి 122-132, అన్నాడీఎంకే కూటమి 87-100, టీవీకే 10-12. చాణక్య స్ట్రాటజీస్: డీఎంకే కూటమి 145-160, అన్నాడీఎంకే కూటమి 50-65, టీవీకే 13-18. సీఎన్ఎన్-న్యూస్18 సర్వే ప్రకారం, ఓట్ల శాతంలో అన్నాడీఎంకే కూటమికి 39.9 శాతంతో స్వల్ప ఆధిక్యం ఉన్నప్పటికీ, డీఎంకే కూటమి 38.9 శాతం ఓట్లతో వెనుకబడింది. అయితే, టీవీకే పార్టీ 15.8 శాతం ఓట్లతో ఫలితాలను ప్రభావితం చేయనుంది.పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలపై సర్వే సంస్థల మధ్య భిన్న అంచనాలు వ్యక్తమయ్యాయి. అధికార తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ మధ్య హోరాహోరీ పోరు ఉంటుందని అన్ని సర్వేలు స్పష్టం చేశాయి. అయితే, ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ వస్తుందనే దానిపై ఏకాభిప్రాయం లేదు. కాంగ్రెస్, వామపక్షాల అవకాశాలపై స్పష్టత లేదు. పీపుల్స్ పల్స్: తృణమూల్ కూటమి 177-187, బీజేపీ 95-110. మ్యాట్రిజ్: బీజేపీ 146-161, తృణమూల్ కూటమి 125-140. పీ-మార్క్: బీజేపీ 150-175, టీఎంసీ కూటమి 118-138. ఏబీపీ-సీ ఓటర్: టీఎంసీ 152--164,

2లో..

## మంత్రి పదవిపై కోదండరాం ఆసక్తికర వ్యాఖ్యలు

- మే 12న కీలక నిర్ణయం తీసుకుంటామని వెల్లడి



**హైదరాబాద్** తెలంగాణ జన సమితి పార్టీ అధ్యక్షుడు కోదండరాం గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కోదండరాంను ఎమ్మెల్సీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నో ప్రయత్నాలు చేశారు. గతంలో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేయగా అది పెండింగ్‌లో పడింది. ఇక స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి లోక్‌భవన్‌కు

2లో..

RNI No. APTEL/2012/53127
TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక
The Voice of Telangana



## నూతన వధూవరులను ఆశీర్వదించిన మారెళ్ళ మల్లికార్జున రావు, తుమ్మలపల్లి రమేష్.



తల్లాడ (తెలంగాణ వాణి) మండల పరిధిలో అన్నారుగూడెం గ్రామానికి చెందిన కొత్తపల్లి నరసింహారావు లేయమ్మ దంపతుల కుమారుడు నూతన వరుడు వెంకట్ -శృతి ల వివాహం బుధవారం అన్నారుగూడెం గ్రామంలో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మారెళ్ళ మల్లికార్జున రావు తుమ్మలపల్లి రమేష్. హాజరై నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని దీవించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ నెంబర్ అలవాల భారతి, దావీదు, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ జెడ్పిటిసి మెంబర్ గిడ్ల పరంజ్యోతి రావు మృతి

### గిడ్ల మృతి కాంగ్రెస్ పార్టీకి, ఫోర్ ఇంక్లైన్ గ్రామపంచాయతీకీ తీరని లోటు

### విచారం వ్యక్తం చేసిన పలువురు



కొత్తగూడెం (తెలంగాణ వాణి) సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కొత్తగూడెం మండల మాజీ జెడ్పిటిసి మెంబర్ గిడ్ల పరంజ్యోతి రావు అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. పరంజ్యోతి రావు మృతి కాంగ్రెస్ పార్టీకి, ఫోర్ ఇంక్లైన్ గ్రామపంచాయతీకీ తీరని లోటుని పలువురు సంతాపం ప్రకటించారు..గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. కాంగ్రెస్ పార్టీలో చురుకైన పాత్ర పోషించి ఆ పార్టీ అగ్ర నాయకుల మన్ననలను పొందారు. స్వతంత్ర అభ్యర్థిగా త్రీ ఇంక్లైన్ ఎంపీటీసీగా పోటీ చేసి విజయం సాధించారు. అంతేగాక కొత్తగూడెం మండల జడ్పీటీసీగా పోటీ చేసి గెలుపొందారు. ప్రతిష్టాత్మకంగా జరిగిన ఈ పోటీలో ఆయన విజయం సాధించడంలో కుటుంబ సభ్యులు కూడా కీలకపాత్ర పోశారు పోషించారు. అలాగే మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. స్వర్గీయ పీవీరావు ఆధ్వర్యంలో ఏర్పాటైన మాల మహానాడు ను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విస్తృత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించడంలో చురుకైన పాత్ర పోషించారు .వారి పవిత్ర ఆత్మకు శాంతిని చేకూర్చాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు సీనియర్ జర్నలిస్ట్ మోటమర్రి రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు కాసులు వెంకట్, ఎంఏ. రజాక్, బీజేపీ నాయకురాలు సముద్రాల గాయత్రీ, మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రవీందర్, బీ ఆర్ ఎస్ నాయకులు నవతన్, టీబీజీకేఎస్ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు కోసం వీరభద్రయ్య తమ సంతాపాన్ని తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కూసన వీరభద్రం



కొత్తగూడెం (తెలంగాణ వాణి) చుంచుపల్లి మండల పరిధిలోని రుద్రంపూర్ గ్రామానికి చెందిన ఐఎన్ టియుసి కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్ - ఫాతిమా దంపతుల పెద్ద కుమారుడు మహమ్మద్ పాషా జునైద్ వెడ్స్ సపూరా వివాహ వేడుకలలో టీబీజీకేఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ , బాబు క్యాంపు మాజీ ఎంపీటీసీ కూసన వీరభద్రం తన మిత్ర బృందంతో కలిసి పాల్గొని నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదిస్తూ విషెస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చిలక రాజయ్య, సకినాల సమ్మయ్య , నాగేశ్వరరావు , నరసింహారావు , రమేష్ , సంపత్ తదితరులు పాల్గొన్నారు .

## మేడేను జిల్లా వ్యాప్తంగా జయప్రదం చేయాలి

### ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్




కొత్తగూడెం (తెలంగాణ వాణి) 141వ మేడే వేడుకలను జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఘనంగా నిర్వహించి జయప్రదం చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం కొత్తగూడెంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్యతో కలిసి ఆయన మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ వర్గం కార్మికులపై భీకర దాడి చేస్తూ, హక్కులను హరిస్తున్న తరుణంలో ఈ మేడే జరుగుతోందని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్మిక వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండించారు. అమెరికాలోని చికాగో నగరంలో కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినం చట్టాన్ని కాలరాస్తూ, మోదీ ప్రభుత్వం 12 గంటల పని విధానాన్ని తేవాలని చూడటం శోచనీయమన్నారు.

కార్మిక సంక్షేమ చట్టాలను తుంగలో తొక్కుతున్న ఇటువంటి ప్రభుత్వాలను గద్దె దించేందుకు కార్మిక వర్గం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి జి. నగేష్, జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, నేరెళ్ల రమేష్, భూక్యా శ్రీనివాస్, మర్రి కృష్ణ, పాషా తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కలను నిజం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు

### ఎమ్మెల్యే చొరవతో నియోజకవర్గంలో వేగంగా 3500 ఇళ్ల నిర్మాణాలు

### సాంకేతిక లోపాలను సరిచేసి లబ్ధిదారులకు అండగా ఉండాలి

### నియోజకవర్గ వ్యాప్తంగా పేదలకు చేరువవుతున్న సంక్షేమ ఫలాలు

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా



చుంచుపల్లి (తెలంగాణ వాణి) పేదల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం సాగుతోందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. చుంచుపల్లి మండలంలోని పెనగడప గ్రామంలో నీడాల సుధాకర్ దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటిని సోమవారం ఆయన కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రత్యేక చొరవతో నియోజకవర్గ వ్యాప్తంగా పేద ప్రజల కోసం మంజూరైన 3500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తవుతున్నాయని, ఇప్పటికే 70 శాతం మేర ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన ఇళ్ల నిర్మాణ పనులను అధికారులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, ఏవైనా సాంకేతిక లోపాలు ఉంటే వెంటనే సరిచేసి లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆయన కోరారు. పేదలకు గూడు కల్పించే ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ కారం సీతారాములు, ఉప సర్పంచ్ గోరె బాబు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, నాయకులు నీడాల సుధాకర్, కుంచం కుమార్, కట్ట సత్యనారాయణ, మేఘనాధం, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## వాహన చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్ట్

### - మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

**హైదరాబాద్** చార్మినార్ జోన్ పరిధిలోని చార్మినార్ పోలీస్ స్టేషన్ క్రైమ్ టీమ్ సభ్యులు విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించి, ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ఒక నిందితుడిని అరెస్ట్ చేశారు. నిందితుడు మొహమ్మద్ నయీమ్ ఖాన్, అలియాస్ మొహమ్మద్ సల్మాన్ అలియాస్ సల్మాన్ నుండి మొత్తం (03) హోండా యాక్టివా ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీనిపై ప్రత్యేక దృష్టి సారించిన క్రైమ్ టీమ్, సిసిటివి (అటువ) ఫుటేజీలు మరియు ఇన్ఫార్మర్ల ద్వారా సమాచారాన్ని సేకరించింది. నిందితుడి కదలికలను, అతని సోషల్ మీడియా (ఇన్స్టాగ్రామ్) పోస్టను నిశితంగా పరిశీలించి నిఘా ఉంచారు. ఈ క్రమంలో, ఏప్రిల్ 28, మధ్యాహ్నం సమయంలో మదీనా ఎక్స్ రోడ్ వద్ద నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు చార్మినార్ మరియు నారాయణగూడ పోలీస్ స్టేషన్ల పరిధిలో మూడు వాహనాలను దొంగిలించినట్లు నేరాన్ని అంగీకరించాడు.

## చెంచుగిరిజనులకు ఉచిత స్పర్శదర్శనం

**శ్రీశైలం** ప్రతీ నెలలోనూ ఒకరోజున చెంచుగిరిజనులకు ప్రత్యేకంగా ఉచిత స్పర్శదర్శనం కల్పించాలని నిర్ణయించడం జరిగింది. గత డిసెంబరు నెలలో (30.12.2025) ముక్కోటి ఏకాదశి రోజున ఈ కార్యక్రమం ప్రారంభించబడింది. ప్రతీ నెలలో కూడా చివరి బుధవారం రోజున చెంచు గిరిజన భక్తులకు ఈ ఉచిత స్పర్శదర్శనాన్ని కల్పించడం జరుగుతోంది. ఇందులో భాగంగా ఈ రోజు (29.03.2026) చెంచు భక్తులకు శ్రీస్వామివార్ల స్పర్శదర్శనం ఉచితంగా దర్శించుకున్నారు. చెంచు గిరిజనులు ఈ రోజు స్వామివార్ల స్పర్శదర్శనం, అమ్మవారిని దర్శించుకోవడం జరిగింది. అదేవిధంగా దర్శనానంతరం చెంచు భక్తులందరికీ దేవస్థాన అన్నపూర్ణా ప్రసాదవితరణ భవనంలో అన్నప్రసాదాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ రోజు ఉదయం చెంచుగిరిజన భక్తులు సంప్రదాయబద్ధంగా తప్పెట వాయిద్యాలతో, చెంచు నృత్యాలతో దర్శనానికి విచ్చేశారు. ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రజాసంబంధాల అధికారి, సంబంధిత సిబ్బంది ఆహ్వానం పలికారు. శ్రీస్వామివారి ఉచిత స్పర్శదర్శనానికి చెంచుగిరిజన భక్తులను ఎంపిక చేయడంలో స్థానిక ఐ.టి.డి.ఏ ప్రాజెక్టు అధికారి వారి సహకారాన్ని తీసుకోవడం జరిగింది.

## పాత్రికేయులపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన ఏపీఓ పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలి

### - ఏపీయూడబ్ల్యూజే తుగ్గలి మండల కమిటీ.

**తుగ్గలి:** తుగ్గలి మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతిపై కథనాలు రాసిన పాత్రికేయులపై ట్రాక్టర్ తో గుద్ది,గడ్డపారతో పొడిచి దాడి చేయండని అనుచిత వ్యాఖ్యలు చేసిన తుగ్గలి మండల ఏపీఓ రామకృష్ణ పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని తుగ్గలి మండల ఏపీయూడబ్ల్యూజే నాయకులు తుగ్గలి తహసిల్దార్ రవి కు,తుగ్గలి పోలీస్ స్టేషన్ నందు బుధవారం రోజున ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా పాత్రికేయులు అధికారులతో మాట్లాడుతూ పాత్రికేయులపై ఇలాంటి వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని,పాత్రికేయుల సంక్షేమం కొరకు ప్రత్యేక చట్టాన్ని తీసుకొని వచ్చి జర్నలిస్టులపై ఎలాంటి దాడులు జరగకుండా రక్షణ కల్పించాలని వారు అధికారులకు తెలియజేశారు.నేటి నుండి తుగ్గలి మండల పరిధిలోని గల పాత్రికేయులపై ఏమైనా దాడులు జరిగితే ఏపీవో రామకృష్ణ పూర్తి బాధ్యత ఆయన వహించాలని పాత్రికేయులు తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాను నిర్వహించారు. జర్నలిస్టులపై ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరి కాదని పలువురు ప్రజా ప్రతినిధులు తెలియజేస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే తుగ్గలి మండల కమిటీ సభ్యులు మురళీమోహన్ రెడ్డి, విజయ్,బసినేపల్లి శేఖర్,నాగేంద్ర, ఇమాములు,భార్గవ్,దేవరాజు హనుమంత తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తి కోసం కన్నవారిపై కక్ష...

### - సొంత ఇంటికే నిప్పు పెట్టిన కుమార్తె!..?

**చిలకలూరిపేట:** ఆస్తి వ్యామోహం మనుషుల మధ్య బంధాలను తుంచేస్తోంది.కన్నవారు అనే మమకారం లేకుండా,ఆస్తి వాటా కోసం ఓ కుమార్తె ఏకంగా తను పుట్టి పెరిగిన ఇంటికే నిప్పు పెట్టిన ఘటన పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో కలకలం రేపింది.?

**అసలేం జరిగిందంటే?**చిలకలూరిపేట పట్టణంలోని గుర్రాల చావిడి ప్రాంతంలో మంగళవారం రాత్రి ఈ దారుణం చోటు చేసుకుంది.స్థానికంగా నివాసం ఉంటున్న దంపతులకు,వారి వివాహిత కుమార్తెకు మధ్య కొంతకాలంగా ఆస్తి విషయమై వివాదాలు నడుస్తున్నాయి.ఆస్తిలో తన వాటా ఇవ్వాలంటూ సదరు కుమార్తె నిత్యం తల్లిదండ్రులను వేధింపులకు గురిచేసేదని సమాచారం.

మంగళవారం రాత్రి ఈ వివాదం కాస్తా ముదరడంతో, ఆమె విచక్షణ కోల్పోయింది. తల్లిదండ్రులు తన మాట వినడం లేదన్న కోపంతో, వారితో కలిసి ఉంటున్న ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టింది.?భయాందోళనలో కుటుంబ సభ్యులు?క్షణాల్లో మంటలు వ్యాపించడంతో ఇంట్లోని వారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కుటుంబ సభ్యులందరూ తృటిలో బయటకు పరుగులు తీశారు. అయితే,మంటల తీవ్రతకు ఇంట్లోని ఫర్నిచర్ మరియు ఇతర విలువైన సామాగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి.

## కేసీఆర్‌ను కవిత విమర్శించడం బాధేసింది

కోమటిరెడ్డి ఆమెపై విమర్శలు గుప్పించారు. అసలు కవిత ఒక కొత్త పార్టీని పెట్టడమే హాస్యాస్పదం అంటూ మండిపడ్డారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో నలుగురు కో ఆప్షన్ సభ్యులను ఎన్నిక చేసిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి వారికి అభినందనలు తెలియజేశారు.ఆ తర్వాత మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి కేసీఆర్ లాంటి ఒక ఉద్యమ కారుడి కుమార్తెగా తనకు ఉన్న బాధ్యతను కవిత గుర్తు చేసుకోవాలని ఈ సందర్భంగా హితవు పలికారు. తన మొట్టమొదటి సమావేశంలోనే తండ్రిని విమర్శించడం ద్వారా కవిత సమాజంలో తనకు ఉన్న మర్యాదను కోల్పోయారని రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమం చేసిన కేసీఆర్‌పై కవిత విమర్శలు చేయడం వ్యక్తిగతంగా తనకు బాధ కలిగించిందని వెల్లడించారు. కన్న తండ్రికి గౌరవం ఇవ్వని కవిత ఇక తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఎలా ఆదర్శంగా నిలుస్తారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రశ్నించారు. కల్వకుంట్ల కుటుంబంలో ఉన్న విభేదాలను రాజకీయాల్లోకి తీసుకురావడం సరికాదని అభిప్రాయపడ్డారు.ఇక దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఇంకా క్లారిటీ రాలేదని కోమటిరెడ్డి పేర్కొన్నారు. ఆ ఢిల్లీ మద్యం కేసు ఇంకా పూర్తిగా ముగియలేదని గుర్తు చేశారు. డబ్బులు బాగా ఉన్నాయి కదా అని కొత్త పార్టీ పెట్టడం వల్ల.. నాయకత్వం రావడం అంత సులభం ఏమీ కాదని తెలిపారు. అదే సమయంలో కవిత తన కొత్త పార్టీ పేరును టీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సేన) గా నామకరణం చేయడం కూడా ఒక జోక్ అని రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. ఇక కవిత ఒంటరిగా ఎన్నికల్లో పోటీ చేస్తే కనీసం డిపాజిట్లు కూడా దక్కవని ఎద్దేవా చేశారు.తన కన్న తండ్రి కేసీఆర్‌పై విమర్శలు చేయడం ద్వారా కవిత తన ప్రతిష్టను తానే దిగజార్చుకున్నారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. ఇక కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ తనకు ఎలాంటి పదవి ఇచ్చినా ఆ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధాల కారణంగా రాష్ట్రంలో, దేశంలో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడిందని పేర్కొన్నారు. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం ముగిసిన తర్వాత ప్రస్తుత పరిస్థితులు మళ్లీ సాధారణ స్థితికి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మాణం చేపట్టే కార్యాచరణ వేగవంతం చేయాలి

ఎత్తులో నిర్మిస్తే ఎంత నీటిని వినియోగించుకునే వీలుందని సమావేశంలో అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కోసం తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే దాదాపు రూ.11 వేల కోట్లు ఖర్చు చేసిందని కొన్ని ప్రాంతాల్లో కాల్వల నిర్మాణం కూడా జరిగింది. 71.5 కి.మీ మేరకు కెనాల్ వర్క్ జరిగిందని అధికారులు సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే కనీసం 100 టీఎంసీల నీటిని వినియోగించుకునే వీలుంటుందని తెలంగాణ ప్రయోజనాలు నెరవేరుతాయని సూచించారు. ఇప్పటికే పూర్తయిన నిర్మాణాలన్నిటిని సద్వినియోగం చేసుకునేందుకు 150 మీటర్ల ఎత్తున బ్యారేజీ నిర్మించాలని నిపుణులు సూచించారు. గతంలో జరిగిన చర్చల ప్రకారం మహారాష్ట్ర 148 మీటర్ల ఎత్తు నిర్మించేందుకు అంగీకరించిందని, 152 మీటర్ల ఎత్తు నిర్మిస్తే మహారాష్ట్ర పరిధిలో ముంపు ప్రభావం ఉంటుందని మధ్యేమార్గంగా 150 మీటర్ల ఎత్తు నిర్మిస్తే తక్కువ ఖర్చుతో నీటిని తీసుకునే వీలుందని ఇంజనీరింగ్ నిపుణులు సూచించారు. ఈ బ్యారేజీ నిర్మాణం చేపడితే ఆదిలాబాద్‌తో పాటు తెలంగాణలో మెట్ట ప్రాంతాల రైతులకు సాగు, తాగు నీటిని అందించవచ్చని, అలాగే, తక్కువ ఖర్చుతో గ్రావిటీపై శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్‌కు నీటిని తరలించేందుకు వీలుంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.ప్రాజెక్ట్ ప్రాధాన్యత దృష్ట్యా వెంటనే మహారాష్ట్రతో సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే మహారాష్ట్రలో పెద్దగా ముంపు ప్రభావం ఉండదని ఎక్కడైనా ముంపు వాటిల్లితే పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. మహారాష్ట్రలో బీజేపీ అధికారంలో ఉన్నందున ఆ ప్రభుత్వాన్ని ఒప్పించి తెలంగాణ ప్రయోజనాలను కాపాడాలని కోరుతూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెంటనే లేఖ రాయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి సూచించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మించాల్సిన అవసరం ఉన్నందున మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి తెలంగాణ రైతుల తరఫున కూడా విజ్ఞప్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఈ సమావేశం ముగిసిన వెంటనే కిషన్ రెడ్డికి లేఖ రాయాలని నిర్ణయం తీసుకున్నారు. అలాగే రేపు కేంద్ర మంత్రి అపాయింట్మెంట్ తీసుకొని నేరుగా కలిసి చర్చించాలని కూడా చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ చర్యల్లో భాగంగా చేపడుతున్న జియో టెస్టింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. వానలు పడేలోపు పనులు పూర్తి చేయాలని మరోసారి స్పష్టం చేశారు.

## మంత్రి పదవిపై కోదండరాం ఆసక్తికర వ్యాఖ్యలు

వెళ్లి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు విజ్ఞప్తి చేయగా ఎట్టకేలకు సర్కార్ సిఫార్సులను ఆమోదించారు. దీంతో కోదండరాం, మంత్రి అజారుద్దీన్‌ల ఎమ్మెల్సీ పదవికి గవర్నర్ ఆమోదముద్ర వేయడంతో సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. దీంతో ఇటీవలె కోదండరాం, అజారుద్దీన్ ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేశారు.ఈ క్రమంలోనే ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన కోదండరాం తాజాగా మంత్రి పదవిపై చేసిన వ్యాఖ్యలు ఇంట్రెస్టింగ్‌గా మారాయి. తనకు మంత్రి పదవి ఇస్తానని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ చెప్పలేదని పేర్కొన్నారు. అదే సమయంలో తాను కూడా తనకు మంత్రి పదవి కావాలని కాంగ్రెస్ పార్టీని అడగలేదని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ వ్యూహాల్లో భాగంగానే కాంగ్రెస్ పార్టీకి టీజేఎస్ పార్టీ మద్దతు ఇచ్చిందని కోదండరాం గుర్తు చేశారు. తాము మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కావాలనే ఆశ లేదని పేర్కొన్నారు.ఇక అదే సమయంలో తెలంగాణ జన సమితి ఏర్పాటైన తర్వాత రాష్ట్రంలో చేయని ప్రజా పోరాటాలు లేవని ఎమ్మెల్సీ కోదండరాం తేల్చి చెప్పారు. టీజేఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న కోదండరాం ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ప్రజలకు అవసరమైనప్పుడు వారికి తోడుగా టీజేఎస్ పార్టీ ఉందని వెల్లడించారు. మే 12వ తేదీన జరగనున్న టీజేఎస్ పార్టీ ప్లీనరీలో కీలక నిర్ణయాలు తీసుకుంటామని ఎమ్మెల్సీ కోదండరాం స్పష్టం చేశారు.గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలో తాము ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొన్నామని ఎమ్మెల్సీ కోదండరాం చెప్పారు. తమను ఎన్నో కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. కేసీఆర్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా టీజేఎస్ పార్టీ పోరాటం చేసినట్లు గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో, ప్రజలకు ఇచ్చిన మాట కోసం ముందుకు నడుస్తున్నామని వెల్లడించారు.ఇక టీజేఎస్ చిన్న పార్టీ అని హేళన చేసినప్పటికీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేసినట్లు కోదండరాం తెలిపారు. చేసే పని నిజాయితీగా ఉండాలని వేరుగా పార్టీ పెట్టినట్లు వెల్లడించారు. ఎన్ని అడ్డంకులు, ఆటు పోట్లు, అవహేళనలను ఎదురైనా పార్టీని ముందుకు నడుపుతున్నట్లు స్పష్టం చేశారు. ప్రజలకు దూరంగా ఉన్న పార్టీ ఎప్పుడూ నిలబడదని అందుకే కేసీఆర్ బయటికి వస్తున్నారని పేర్కొన్నారు. తాము సరిగ్గానే ఉన్నామని తెలంగాణ ప్రజలే మారాలని కేసీఆర్ భావిస్తున్నారని విమర్శించారు. కల్వకుంట్ల కుటుంబంలో ఉన్న లోపాలను కవిత బయట పెడుతోందని బీఆర్ఎస్ పార్టీ అంటే కుటుంబమే అని కవిత చెప్పకనే చెబుతున్నారని కోదండరాం ఆరోపించారు.

## ఉత్కంఠం రేపుతున్న ఎగ్జిట్ పోల్స్

బీజేపీ 109--121. ఇండియా టుడే - యాక్సిస్ మై ఇండియా: బీజేపీ 134--160, టీఎంసీ 130--156. రిపబ్లిక్ - జన్ కీ బాత్: బీజేపీ 162--185, టీఎంసీ 104--121. ఎన్డీటీవీ పోల్ ఆఫ్ పోల్స్: టీఎంసీ 156, బీజేపీ 121. కేరళలో అధికార ఎల్డీఎఫ్, ప్రతిపక్ష యూడీఎఫ్ మధ్య గట్టి పోటీ నెలకొన్నట్లు ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. చాలా సర్వేలు యూడీఎఫ్‌కు స్వల్ప ఆధిక్యం కనబరిచాయి. మ్యాట్రిజ్: యూడీఎఫ్ 70-75, ఎల్డీఎఫ్ 60-65, ఎన్డీయే 3-5.ఓట్ వైబ్: యూడీఎఫ్ 79-80, ఎల్డీఎఫ్ 58-68, ఎన్డీయే 0-4.పీపుల్ ఇన్ సైట్: యూడీఎఫ్ 66-76, ఎల్డీఎఫ్ 58-68, బీజేపీ 10-14. ఈ అంచనాలు రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠను రేపుతున్నాయి. అసలు విజేతలెవరో తెలియాలంటే ఓట్ల లెక్కింపు వరకు వేచి చూడాల్సిందే.

## బెంగళూరులో వర్ష బీభత్సం

(47.0 మి.మీ.) సహా పలు ఇతర ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు కురిశాయి. దీంతో పలుచోట్ల రహదారులపై నీరు నిలిచిపోయి, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రద్దీ సమయాల్లో ప్రయాణికుల కష్టాలు మరింత పెరిగాయి.

## హైదరాబాద్ మెట్రో రైలు ప్రభుత్వపరం

భావిస్తోంది. ఎల్ అండ్ టీ నుంచి మెట్రో రైలును స్వాధీనం చేసుకునే ఒప్పందానికి ముందుగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఎల్ అండ్ టీ ఛైర్మన్, ఎండీ ఎస్.ఎన్.సుబ్రహ్మణ్యన్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వారిద్దరి మధ్య చర్చలు జరిగాయి. ఇకపోతే హైదరాబాద్ మెట్రో రైల్ ప్రభుత్వంలో విలీనం వల్ల ప్రభుత్వానికి మేలు జరుగుతుంది అని భావిస్తోంది. విలీనం వల్ల మెట్రో రెండో దశ విస్తరణ మరింత ఈజీ అయ్యే అవకాశం ఉంది అని భావిస్తున్నారు. మరోవైపు ప్రైవేట్ సంస్థలు లాభదాయకం కాని మార్గాల్లో పెట్టుబడులు పెట్టేందుకు వెనకాడుతుంటాయి. కానీ ప్రభుత్వం నేరుగా నిర్వహిస్తే ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పాతబస్తీ వంటి రద్దీ ప్రాంతాలకు, విమానాశ్రయానికి మెట్రోను వేగంగా విస్తరించే అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. మొత్తం మీద మెట్రో ప్రభుత్వంలో విలీనం కావడం ఒక కత్తి మీద సాము లాంటిదే అన్న అభిప్రాయం కూడా వెల్లడవుతుంది. ప్రయాణికులకు రాయితీలు కల్పిస్తూనే ప్రైవేట్ సంస్థల తరహాలో నాణ్యమైన సేవలను కొనసాగించడం ప్రభుత్వానికి ఒక పెద్ద పరీక్షగా మారే అవకాశం ఉంది.హైదరబాద్ మెట్రోను మరో ఆర్టీసీలా కాకుండా అత్యాధునిక ప్రభుత్వ రవాణా వ్యవస్థగా తీర్చిదిద్దగలిగితేనే ఈ విలీనానికి పూర్తి సార్థకత లభిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.

RNI No. APTEL/2012/53127

## పదో తరగతి ఫలితాల్లో ఆదర్శ మోడల్ స్కూల్ లక్కారం విద్యార్థుల సత్తా




చౌటుప్పల్ (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి) యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ లక్కారం మోడల్ స్కూల్ పదో తరగతి ఫలితాల్లో తెలంగాణ మోడల్ స్కూల్ లక్కారం విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు:చిరందాసు గాయత్రి 571స్కూల్ ఫస్ట్, బోరెడ్డి కెతన 565 స్కూల్ సెకండ్, ఎం. వర్షిత 561 స్కూల్ థర్డ్, వాక విఘ్నేష్ 555,బొడ్డుపల్లి చైత్ర సాయిశ్రీ 549, అలేఖ్య 543, అంశుమన్ 532, 18 మంది విద్యార్థులకు 500 మార్కులు పైగా సాధించి సత్తా చాటారని ప్రిన్సిపాల్ శివ స్వరూప రాణి తెలిపారు. విద్యార్థుల విజయంపై ప్రిన్సిపాల్ హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల అంకితభావం విద్యార్థుల కఠోర శ్రమ, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయి. గ్రామీణ ప్రాంత విద్యార్థులైనా కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా మార్కులు సాధించడం గర్వకారణం అని అన్నారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## పదో తరగతిలో విద్యార్థుల ప్రభంజనం



వనపర్తి (తెలంగాణ వాణి ప్రతినిధి) వనపర్తి జిల్లాలో గల 9 ప్రీ మెట్రిక్ బీసీ సంక్షేమ వసతి గృహాల్లో 7 సంక్షేమ వసతి గృహాల యందు 100శాతం రిజల్ట్ సాధించడం జరిగింది. మిగిలిన రెండు వసతి గృహాల యందు 98శాతం విజయం సాధించడం జరిగింది. బీసీ సంక్షేమ వసతి గృహాల్లో 130 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరుకాగా 128 మంది విద్యార్థులు పాసైనారు. ఇద్దరు విద్యార్థులు ఫెయిల్ అయినారు. జిల్లా మొత్తం బీసీ వసతి గృహాల యొక్క పాస్ పర్సంటేజీ 98.46,100శాతం ఫలితాలు సాధించినటువంటి వసతి గృహ సంక్షేమ అధికారులకు, విద్యార్థులకు జిల్లా బీసీ సంక్షేమ అధికారి ముజాహిద్ ఖాస్, సహాయ బీసీ సంక్షేమ అభివృద్ధి అధికారి ఆంజనేయులు అభినందించడం జరిగింది.

## పదవ తరగతి ఫలితాల్లో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలలు





హసన్ పర్తి (తెలంగాణ వాణి ప్రతినిధి) హసన్ పర్తి మండలంలో పదవ తరగతి ఫలితాలు విశేషంగా నమోదయ్యాయి. మండలంలో మొత్తం ఉత్తీర్ణత శాతం 99.08గా నమోదై, జిల్లాలో నాలుగవ స్థానాన్ని సాధించడం గర్వకారణంగా నిలిచింది. మండలంలోని 14 ప్రభుత్వ పాఠశాలల్లో 8 పాఠశాలలు 100శాతం ఉత్తీర్ణత సాధించగా, ప్రభుత్వ,ప్రైవేట్ కలిపి ఉన్న మొత్తం 37 పాఠశాలల్లో 26 పాఠశాలలు శాతం 100 ఫలితాలు సాధించాయి.ఈ సంవత్సరం మండలంలో మొత్తం 1867 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరుకాగా, అందులో 1852 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలలలో జడ్పిహెచ్ఎస్ వంగపహాడ్ పాఠశాలకు చెందిన డి.అర్పిత 545 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. జెడ్పీహెచ్ఎస్ వంగపహాడ్, దేవన్నపేట, హసన్పర్తి బాలుర పాఠశాల, మల్లారెడ్డిపల్లి, ముచ్చర్ల, పెగడపల్లి, సీతంపేట, సిద్ధాపూర్ పాఠశాలలు 100శాతం ఫలితాలు సాధించి ఆదర్శంగా నిలిచాయి. అలాగే కేజీబీవీ హసన్పర్తిలో పరీక్ష రాసిన 45 మంది విద్యార్థులు అందరూ ఉత్తీర్ణులై 100శాతం ఫలితాన్ని నమోదు చేశారు.మండలంలోని గురుకుల పాఠశాలల్లో టీఎస్ ఆర్ఎస్ హసన్పర్తి బాలికల పాఠశాలకు చెందిన కే.రోహిణి ప్రియ 580 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందిఈ విజయానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నిర్వహించిన ప్రత్యేక తరగతులు, విద్యార్థులపై చూపిన ప్రత్యేక శ్రద్ధ కారణమని మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు.

## ఆడబిడ్డ వివాహానికి మంగళసూత్రాన్ని అందజేసిన

### టిఎస్. నిర్మాణ సంస్థ అధినేత శ్రీ తిరుమల మహేష్



వనపర్తి (తెలంగాణ వాణి ప్రతినిధి ) వనపర్తి పట్టణంలోని నాయిబ్రాహ్మణ ఆడబిడ్డ వివాహ మహోత్సవానికి టి.ఎస్. నిర్మాణ సంస్థ అధినేత శ్రీ తిరుమల మహేష్ తన ఉదారతను చాటుకున్నారు. నాగవరం గ్రామానికి చెందిన నాయిబ్రాహ్మణ కులస్తులు సదుర్ల సత్యనారాయణ కుమార్తె మౌనిక (ప్రవళిక) వివాహానికి, శ్రీ తిరుమల మహేష్ తన సొంత ఖర్చుతో పవిత్ర మంగళసూత్రాన్ని (తాళిబొట్టు) కానుకగా అందజేశారు.వనపర్తి పట్టణ నాయిబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు అశ్విని చంద్రకుమార్ ఈ కార్యక్రమానికి హాజరై, వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయిబ్రాహ్మణ కుటుంబానికి తోడ్పాటు అందించాలనే సదుద్దేశంతో, పిలవగానే స్పందించి మంగళసూత్రాన్ని అందజేసిన తిరుమల మహేష్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కుల బాంధవుల పట్ల మమకారంతో అండగా నిలుస్తున్న మహేష్ సేవలు ఎంతో అభినందనీయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ నాయిబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు అశ్విని చంద్రకుమార్, జిల్లా అధ్యక్షుడు అశ్విని రమేష్, జిల్లా గౌరవాధ్యక్షుడు మాందాపూర్ కృష్ణయ్య , జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకుంట నాగరాజు, ఉపాధ్యక్షుడు అశ్విని మంజు, బాంబే శివ, ప్రచార కార్యదర్శి విజయ్ కుమార్, అశ్విని రవి, అశ్విని రాజు తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

# మేడే ను జయప్రదంచేయండి.

### సిపిఎం పార్టీ కొమురవెల్లి మండల కార్యదర్శి తాడూరి రవీందర్ .




కొముర‌వెల్లి (తెలంగాణ వాణి ప్రతినిధి) ఏప్రిల్ 29 ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే ను కొమురవెల్లి మండలం లోని అన్ని గ్రామాలలో ఎర్రజెండాలు ఎగరవేసి జయప్రదం చేయాలని గ్రామాలలో కార్మికుల, ప్రజల హక్కులు ప్రతిబింబించేలా ప్రదర్శనలు సభలు నిర్వహించాలని సిపిఎం పార్టీ కొమురవెల్లి మండల కార్యదర్శి తాడూరి రవీందర్ కార్మికులు, రైతులు, కూలీలు, శ్రామిక ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం రోజున మండలంలోని తపస్ పల్లి గ్రామంలో హమాలీ కార్మికులతో మాట్లాడుతూ 1886 మే 1వ తేదీన అమెరికాలోని చికాగో నగరం హే మార్కెట్లో ఎనిమిది గంటల పని దినం, కనీస వేతనాలు అమలు, కార్మిక సంఘాలను హక్కుల కోసం నిర్మాణం, చేసుకునే హక్కుల కోసం ప్రపంచ కార్మికులంతా ఏకమై పోరాడి ప్రాణ త్యాగాలు చేసి హక్కులు సాధించుకున్న రోజు ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే అని అన్నారు.చికాగో అమరుల పోరాట స్ఫూర్తితో గ్రామ గ్రామాన అడ్డాల వద్ద కంపెనీల వద్ద పని ప్రదేశాల వద్ద సిఐటియూ జెండాలు ఎర్రజెండాలు ఎగరవేయాలని వారు పిలుపునిచ్చారు. బిజెపి నాయకత్వంలోని నేటి కేంద్ర ప్రభుత్వం భారత కార్మిక వర్గాన్ని అణిచివేసి మేడే నాటి పూర్వపు దుర్మార్గపు రోజుల్లోకి తీసుకుపోయేందుకు తీవ్రంగా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. దశాబ్ద కాలం పాటు పోరాటాలు త్యాగాలతో కార్మిక వర్గం సాధించుకున్న 29 రకాల చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లుగా రూపొందించిందన్నారు. కార్మిక హక్కులను హరించి వేస్తూ ఎనిమిది గంటల పని దినం స్థానంలో 12 నుంచి 16 గంటలు పనిచేసే విధంగా, కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మిక సంఘాలను పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు లేకుండా కార్మిక చట్టాలను రద్దు చేసిందన్నారు. ప్రజా వ్యతిరేక చట్టాలను చేస్తూ ప్రభుత్వరంగాన్ని ధ్వంసం చేసి ప్రైవేటుపరం చేయడానికి కార్పొరేట్ శక్తులకు తలుపులు బార్ల తెరిచారని ఈ విధానాల వలన అన్ని వర్గాల ప్రజలపై భారాలు పడుతున్నాయని కార్మికుల మధ్య ఐక్యతను దెబ్బతీసే విధంగా మతోన్మాదాన్ని ముందుకు తీసుకు వస్తుందని ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే స్ఫూర్తితో కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం రాజ్యాంగ పరిరక్షణ కోసం భారత రాజ్యాంగం ద్వారా పొందిన ప్రాథమిక హక్కులను నిలుపుకోవాలన్న లక్ష్యంతో కార్మిక వర్గం మరింత పట్టుదలతో పోరాడుతూ మేడే అమరుల స్ఫూర్తితో ఐక్య పోరాటాలు ఉధృతం చేయాలని వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాకనాటి బాలు హమాలీ కార్మికులు మల్కని కనకయ్య కంకణాల నర్సింలు పుట్ట యాదయ్య చిన్నోల కనకయ్య రాజేశం కనకయ్య ఈగ గోపాల్ ఈగ స్వామి చిన్నోల కిష్టయ్య కంకణాల కనకయ్య పుట్ట పరిషి ఓర్రోల నర్సింహులు రూద్రరాపు కనకయ్య రుద్రరపు నర్సింలు రుద్రరపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు

## పోలీస్‌స్టేషన్లను ఆకస్మిక తనిఖీ చేసిన డీసీపీ




హసన్ పర్తి (తెలంగాణ వాణి ప్రతినిధి) హసన్ పర్తి పోలీస్ స్టేషన్‌ను వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, నేర నియంత్రణకు మరింత పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీలు, జనరల్ డైరీ, రిజిస్టర్లు,ఇతర రికార్డులను పరిశీలించి, రికార్డుల నిర్వహణపై తగిన సూచనలు చేశారు.స్టేషన్ పరిధిలోని గ్రామాలను సందర్శించాలని,ప్రజలకు పోలీసులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలని, యువతకు సైబర్ నేరాల నివారణపై, మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ పట్టే చేరాలు, ఎస్సైలు దేవేందర్, గోవర్ధన్, రవి సిబ్బంది ఉన్నారు.

## నేరాల అదుపులో ప్రజలు కీలకపాత్ర పోషించాలి.

### భరోసా టీం అవగాహన సదస్సు.



పెద్దపల్లి :ఏప్రిల్,29 (తెలంగాణ వాణి ప్రతినిధి ) రామగుండము సిపి అంబర్ కిషోర్ ఝా ఐపీఎస్ ఆదేశానుసారంగ మంథని, సుల్తానాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా పాలనా– ప్రగతి ప్రణాళిక (90 రోజుల ప్రణాళిక) లో బాగంగా భరోసా టీం, అవగాహన కార్యక్రమంను నిర్వహించడం జరిగింది.రకరకాల పద్ధతుల్లో మాయమాటలు చెప్పి అమ్మాయిలను, మహిళలను మోసాలు చేస్తున్న నేటి కాలంలో నేరాల అదుపులో ప్రజలు కీలకపాత్ర పోషించాలని, జాగ్రత్తతో మెలగడం వల్ల నేరాలను అదుపు చేయవచ్చని వారు పేర్కొన్నారు.లింగ వివక్షత చూపించకుండా పిల్లల పెంపకం వుండాలని, బాల్య వివాహం నిర్మూలన ,సైబర్ నేరాలు, మానవ అక్రమ రావణ మహిళలపై అత్యాచారాలు, విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల నిర్మూలన ఎవరైనా మాదక ద్రవ్యాలు తీసుకున్నట్లు తెలిసిన వెంటనే పోలీసు వారికీ సమాచారమివ్వాలని, సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫిర్యాదు చేయాలి వివరించారు. మనకు తెలియని నెంబర్స్ నుండి మహిళలకు ఇబ్బందులు గురైనప్పుడు, ఎవరైనా మహిళలపై అనుచితంగా అసభ్యంగా ప్రవర్తించినట్లయితే, పని ప్రదేశంలో వేధింపులు జరిపినా ధైర్యంగా పోలీస్ వారికి సమాచార అందించాలని సూచించారు.భరోసా సెంటర్ విధులు మహిళలకు,పిల్లలకు భరోసా సెంటర్ కల్పిస్తున్న సదుపాయాలు , ఫోక్స చట్టం ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో భరోసా ఇంచార్జ్ ఎస్సై.ఎం లావణ్య ,కో–అర్దినటార్ కౌన్సలర్ అశ్రీత , ఎండీ . అస్మా , స్వాతి .భారతి తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ పెట్టడం పాన్ షాపు పెట్టినంత సులువు అయిపోయింది

### -కవిత కొత్త పార్టీ ప్రకటనపై కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు




చౌటుప్పల్ (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి) కవిత పార్టీ పెట్టడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. కవిత సింగిల్‌గా పోటీ చేస్తే డిపాజిట్ కూడా రాదు అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తండ్రికి విలువ ఇవ్వని మనిషి అమ్మ ఎలా అవుతుందని ప్రశ్నించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం కో–ఆప్షన్ సభ్యుల ప్రమాణస్వీకరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్ల తో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుడు కేసీఆర్‌ను కవిత తిట్టడం బాధగా ఉందని, తాను ఒక ఉద్యమకారుడి బిడ్డ అనే తనకు గుర్తు ఉంది. తండ్రి అంటే కూతురికి ప్రేమ ఉండాలి. తండ్రికి విలువ ఇవ్వని మనిషి అమ్మ ఎలా అవుతుంది. తన మొదటి సమావేశంలో తండ్రిని తిట్టడంతో తను మర్యాద పోగొట్టుకుందన్నారు. తన అన్న మీద ఉన్న కోపం తండ్రి మీద తీయడం తప్పు అనీ, మద్యం కుంభకోణంలో తనకు ఇంకా క్లీన్ చిట్ రాలేదు. కేసు పూర్తి కాలేదన్నారు. టీఆర్ఎస్ పేరు మీదనే పార్టీ పెట్టడం హాస్యాస్పదం అని అన్నారు. డబ్బులు ఉ?న్నాయని పార్టీ పెట్టడం పాన్ షాపు పెట్టినంత సులువు అయిపోయింది. పార్టీ కాదు తను సొంతంగా పోటీ చేసిన దగ్గర డిపాజిట్ కూడా రాదని అన్నారు. కాంగ్రెస్ అధిష్టానం నాకు మంత్రి పదవి పై హామీ ఇచ్చిందని నాకు పదవి ఇస్తే కచ్చితంగా ఆ పదవికి న్యాయం చేస్తా అని అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ చైర్పర్సన్ మొగు దాల పావని రమేష్ గౌడ్, వైస్ చైర్మన్ వినయ్ కుమార్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మరింత వేగిరంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

### మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి



మానకొండూర్:ఏప్రిల్ 29 (తెలంగాణ వాణి) ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మరింత వేగిరంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుం దని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారా యణ చెప్పారు.మానకొం డూర్ మండలం కొండపలకల గ్రామంలో బొంగోని కవిత– కృష్ణ,బొల్లం ఉమ–శ్రీనివాస్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలకు బుధవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పొందిన లబ్ధిదా రులు సకాలంలో నిర్మాణాలు పూర్తి చేసుకోవాల్సి ఉంటుంద న్నారు.ఇళ్ల నిర్మాణాలు మరింత వేగిరంగా పూర్తి చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొ న్నారు.గూడు లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇంటి పథకం సొంతింటి కలను సాకారం చేస్తున్నదని, అందుకే ఈ పథకానికి విశేష ఆదరణ లభిస్తున్నదని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ పథకం అమలుపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నదని ఆయన చెప్పారు.అంతే కాకుండా ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన సమస్యలు సత్వరం పరిష్కరించడం, దశల వారీ బిల్లుల చెల్లింపు ల్లో జాప్యాన్ని నివారించడం వంటి తదితర సమస్యలతో పాటు రెవెన్యూశాఖకు సంబంధించిన పలు అంశా లపై గురువారం హైదరాబాద్ లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి సమావేశం జరుగుతుం దని,ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా ఇంచార్జీ మంత్రి,ప్రభు త్వ ప్రత్యేక కార్యదర్శులు, ఎంపీలు,ఎమ్మెల్సీలు,ఎమ్మె ల్యేలు,ఆయా జిల్లాల కలెక్టర్లు తదితరులు పాల్గొంటారని డాక్టర్ కవ్వంపల్లి వివరించారు. ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాలు లబ్ధిదారులకు మేలు చేకూర్చే విధంగా ఉంటాయనే ఆశా భావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మానకొం డూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, కొండపలకల సర్పంచ్ మాడ లక్ష్మి–తిరుప తిరెడ్డి, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు రాములు గౌడ్, పార్టీ నాయకులు తోట శ్రీనివాస్, గడ్డం మార్కండేయ, నాగరాజు, బండి సంపత్, బండి వీరయ్య, పింగళి రవీందర్ రెడ్డి, కోంద్ర సురేష్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఎస్ సి ఫలితాలలో మండల స్థాయిలో
# బాలుర పాఠశాల విద్యార్థి





హుస్నాబాద్, ఏప్రిల్ 29 (తెలంగాణ వాణి ఆర్ సి) హుస్నాబాద్ పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రతిభ కనబరిచారు. పాఠశాలలో మొత్తం విద్యార్థులు 53 మంది పరీక్షలు రాయగా 51 మంది ఉత్తీర్ణత సాధించారు.ప్రథమ స్థానం పిల్లి చరణ్ 557 మార్కులు ,ద్వితీయ స్థానం ఎండి సిమ్రాన్ 542 మార్కులు,తృతీయ స్థానం కత్తుల అభిలాష్ 540 మార్కులతో పాటు మెరుగైన ఫలితాలు 34 మంది విద్యార్థులు 400కు పైగా మార్కులు సాధించారు. మండలంలో జిల్లా పరిషత్ పాఠశాలలలో 557 మార్కులతో పిల్లి చరణ్ మండల టాపర్‌గా నిలవడం పాఠశాలకు గర్వకారణమైంది.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. వాసుదేవ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, ఎక్స్ అఫిషియో సభ్యుడు పూదరి వరప్రసాద్, ఏఎంసీ చైర్మన్ బెజ్జంకి వరలక్ష్మి తదితరులు విద్యార్థులనుఅభినందించారు. ఉపాధ్యాయ బృందం కృషి వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు.

## ఎమ్మెల్యే జిఎంఆర్ ను పరామర్శించిన జహీరాబాద్
## ఎమ్మెల్యే మాణిక్ రావు, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి



పటాన్ చెరు, ఏప్రిల్ 29, (తెలంగాణ వాణి రిపోర్టర్) పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ని బుధవారం సాయంత్రం జహీరాబాద్ శాసన సభ్యులు మాణిక్ రావు, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన కోలుకొని ప్రజాసేవలోకి రావాలని వారు ఆక్షాక్షించారు.

## పది ఫలితాల్లో జిల్లాకు
# రాష్ట్ర స్థాయిలో 4వ స్థానం



జగిత్యాల:ఏప్రిల్ 29(తెలంగాణ వాణి ప్రతినిధి) జిల్లాలో గత నెల మార్చి 13 నుంచి ఏప్రిల్ 15 వరకు నిర్వహించిన పదవ తరగతి పరీక్షలలో జగిత్యాల జిల్లా అద్భుత విజయంతో 98.87 శాతంతో రాష్ట్రంలోనే 4వ స్థానంలో నిలిచింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లా మొత్తంగా 12687 మంది విద్యార్థులకు గాను 12544 మంది విద్యార్థులు అద్భుతంగా విజయాన్ని సాధించారని, గతంలో నాలుగవ స్థానం మరియు ఇప్పుడు కూడా అదే స్థానాన్ని నిలుపుకోవడం విజయానికి కృషి చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము, వివిధ మండలాల విద్యాధికారులను, పాఠశాల సిబ్బందిని, విద్యార్థులను, తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఇదే స్ఫూర్తిని మునుముందు కొనసాగించాలని ఆకాంక్షించినారు.ఈ విజయానికి విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకం, తల్లిదండ్రుల సహకారం ప్రధాన కారణమని తెలిపారు.ఇదే ఉత్సాహంతో భవిష్యత్తులో విజయాలు సాధించి జిల్లాకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్, జిల్లా విద్యాధికారి కె.రాము,యం ఈ ఓ లు, జిల్లా కోఆర్డినేటర్లు, విద్యా శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

## పేదల సంక్షేమమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం
## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



వేములవాడ (తెలంగాణ వాణి ప్రతినిధి) రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే అర్హులైన ప్రతి ఒక్కరికి సొంత ఇంటి కళ నెరవేర్చడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం వేములవాడ రూరల్ మండల పరిధిలోని జయవరం, మల్లారం, హనుమాజీపేట, మరియు బాలరాజుపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమాలకు ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఒక్కో ఇంటికి వెళ్లి లబ్ధిదారులతో కలిసి గృహ ప్రవేశం చేసిన వారికి ఆది శ్రీనివాస్ నూతన వస్త్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ గూడు లేని పేదలకు ఆత్మగౌరవంతో కూడిన జీవనాన్ని అందించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పారదర్శకంగా అర్హులను ఎంపిక చేసి ఆర్థిక సాయం అందిస్తున్నామని,నిరాశ్రయులు నేడు సొంత ఇంటి యజమానులుగా మారడం సంతోషకరమని అన్నారు.?ప్రభుత్వంపై నమ్మకంతో ఉన్న ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందుతాయని, రానున్న రోజుల్లో మరిన్ని ఇళ్లను మంజూరు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ గృహ ప్రవేశ వేడుకల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హత్య కేసులో నలుగురు నిందుతులకు
# యావజ్జీవ కారాగార శిక్ష

**- నేరం చేస్తే శిక్షలు తప్పవు,శిక్షలతోనే సమాజంలో మార్పు - జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.**



రాజన్న సిరిసిల్ల,ఏప్రిల్ 29 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి) :ముస్తాబద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన హత్య కేసులో నలుగురు నిందితులకు యావజ్జీవ కారాగార (జీవిత ఖైదు) శిక్షతో పాటు ఒక్కొక్కరికి 6,000 రూపాయలు జరిమానా విధిస్తూ బుధవారం సిరిసిల్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీరజ కీలక తీర్పు వెల్లడించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.ముస్తాబాద్ మండలం బద్నకల్ గ్రామానికి చెందిన కస్తూరి రాంరెడ్డి మరియు కస్తూరి కరుణాకర్ రెడ్డి ఇద్దరి మధ్య వ్యవసాయ భూమి సరిహద్దుల గురించి గొడవలు జరుగుతుండేవి వాటిని మనసులో పెట్టుకొని ఎలాగైనా కస్తూరి కరుణాకర్ రెడ్డిని చంపాలని కస్తూరి రాంరెడ్డి అతని కుటుంబ సభ్యులు నిర్ణయించుకున్నారు.పథకం ప్రకారం తేదీ 27-12-2020 రోజున కరుణాకర్ రెడ్డి తన పొలంలో పని చేసుకుంటుండగా కస్తూరి రాంరెడ్డి అతని భార్య మంజుల, ఇద్దరు కుమారులు వెంకటేశ్ , మహేష్ లు అక్కడికి చేరుకుని నలుగురు కలసి కరుణాకర్ రెడ్డి ని గొడ్డలితో నరికి,కట్టెలతో కొట్టి చంపినారు.ఇట్టి కేసులో మృతిని సోదరి పద్మ ఫిర్యాదు మేరకు ముస్తాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి నిందుతులను రిమాండ్ కి తరలించారు.అప్పటి సిరిసిల్ల రూరల్ సీ.ఐ ఉపేందర్ కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేయగా,ఈకేసు విచారణ దశలో అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో సిరిసిల్ల రూరల్ సీ.ఐ మొగిలి,కోర్టు మానిటరింగ్ ఎస్సై రవీంద్ర నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ రాజేందర్ నాయక్,కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్ లు కోర్టులో 14 మంది సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్ వాదించారు.శాస్త్రీయ ఆధారాలు మరియు సాక్ష్యాలను పరిశీలించిన గౌరవ న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితులకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి 6000 రూపాయల జరిమానా విధించడం జరిగిందని,సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకోలేరని , శిక్షల ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని జిల్లా ఎస్పీ తెలిపారు. పోలీసులు మరియు ప్రాసిక్యూషన్ సమన్వయంతో వ్యూహాత్మకంగా న్యాయ విచారణ, న్యాయ నిరూపణ నిర్వహించి నిందితులకు తప్పనిసరిగా శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు.పై కేసుల్లో నిందితులకు శిక్ష పడటంలో కృషి చేసిన అదనపు ఎస్పీ చంద్రయ్య, పీపీలు పెంట శ్రీనివాస్,అశ్విన్,అప్పటి సీ.ఐ లు సర్వర్,ఉపేందర్, మొగిలి, సిఎంఎస్ ఎస్ఐ రవీందర్ నాయుడు, కోర్ట్ మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్,కోర్టు కానిస్టేబుల్ రాజేందర్,దేవేందర్ ప్రస్తుత సీ.ఐ నాగేశ్వరరావు,ఎస్.ఐ గణేష్ లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ..
# వ్యక్తిపై కేసు నమోదు




చందుర్తి (తెలంగాణ వాణి ప్రతినిధి) చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి, తప్పుడు పత్రాలతో మోసానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చందుర్తి ఎస్.ఐ. జె. రమేష్ తెలిపారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నర్సింగాపూర్ గ్రామానికి చెందిన నాగుల తిరుపతి అనే వ్యక్తి తన ఇంటిపై బ్యాంకు రుణం హౌసింగ్ లోన్ పొందాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో లోన్ కోసం అవసరమైన ఇంటి ధ్రువీకరణ పత్రాలపై నర్సింగాపూర్ పంచాయతీ కార్యదర్శి కళాజ్యోతి సంతకాన్ని నిందితుడు ఫోర్జరీ చేశాడు. అంతేకాకుండా,తన స్వార్థ ప్రయోజనాల కోసం గ్రామ పంచాయతీకి సంబంధించిన నకిలీ స్టాంపులను కూడా సృష్టించి అధికారులను, బ్యాంకు ప్రతినిధులను ఉద్దేశపూర్వకంగా మోసం చేశాడు. ఈ విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి కళాజ్యోతి, తన సంతకాన్ని మరియు కార్యాలయ ముద్రలను దుర్వినియోగం చేసిన తిరుపతిపై చర్యలు తీసుకోవాలని చందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి దరఖాస్తు మేరకు నిందితుడు నాగుల తిరుపతితో పాటు, ఈ మోసంలో అతనికి సహకరించిన ఇతర వ్యక్తులపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్.ఐ. రమేష్ వివరించారు. ప్రభుత్వ అధికారుల సంతకాలను, ముద్రలను ఫోర్జరీ చేస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

## పది ఫలితాల్లో హుస్నాబాద్
## ప్రభుత్వ బాలుర పాఠశాల ప్రభంజనం

హుస్నాబాద్,ఏప్రిల్ 29 తెలంగాణ వాణి ప్రతినిది పదో తరగతి ఫలితాల్లో హుస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు) విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పాఠశాల కీర్తిని చాటారు. ఈ ఏడాది పాఠశాల నుంచి మొత్తం 53 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందులో 51 మంది ఉత్తీర్ణత సాధించి రికార్డు సృష్టించారు. విద్యార్థి పిల్లి చరణ్ 557 మార్కులు సాధించి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో టాపర్‌గా నిలవడం గమనార్హం.అలాగే ఎండి సిమ్రాన్ 542 మార్కులతో ద్వితీయ స్థానాన్ని, కత్తుల అభిలాష్ 540 మార్కులతో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. వీరితో పాటు మరో 34 మంది విద్యార్థులు 400కు పైగా మార్కులు సాధించి మెరుగైన ఫలితాలను నమోదు చేశారు.ఈ ఘనత సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రాంగణంలో ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కె. వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ బృందం నిరంతర కృషి, విద్యార్థుల క్రమశిక్షణ వల్లే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని హర్షం వ్యక్తం చేశారు.మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్ పర్సన్ చిత్తారి పద్మ, ఎక్స్ అఫిషియో సభ్యుడు పూదరి వరప్రసాద్, ఏఎంసీ చైర్మన్ బెజ్జంకి వరలక్ష్మి తదితరులు పాఠశాలను సందర్శించి విద్యార్థులను, ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కార్పొరేట్ సంస్థలకు దీటుగా రాణించడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు.

## ఎమ్మార్వో ను సన్మానించిన
## ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు తొంట సాయిలు



నాగిరెడ్డిపేట (తెలంగాణ వాణి ప్రతినిధి) నాగిరెడ్డిపేట మండలంలోని బుధవారం రోజున ఎమ్మార్వో బిక్షపతిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించిన ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు తొంట సాయిలు. ఇట్టి కార్యక్రమంలో భాగంగా సీనియర్ నాయకులు రాములు , శంకర్ , మాదిగ కుల ఉపాధ్యక్షులు , సభ్యులు దావీదు , ప్రధాన కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ
# అప్రమత్తంగా ఉండాలి...

**కలెక్టర్ గరిమ అగ్రవాల్**




రాజన్న సిరిసిల్ల,ఏప్రిల్ 29 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి) : ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరగాళ్లు వినూత్న రీతుల్లో మోసాలకు పాల్పడుతున్నారని, అపరిచిత వ్యక్తుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటూ సైబర్ క్రైమ్‌పై కనీస అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.బుధవారం ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా పోలీస్, మహిళా, శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన సైబర్ క్రైమ్ అవగాహన సదస్సుకు కలెక్టర్, ఎస్పీ మహేష్ బి. గితేతో కలిసి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించినారు.అనంతరం కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జూన్ 12 వరకు వివిధ శాఖల సమన్వయంతో జిల్లావ్యాప్తంగా అభివృద్ధి మరియు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ముఖ్యంగా ఫోన్ ద్వారా వచ్చే ఓటీపీలు, బ్యాంక్ వివరాలు మరియు తెలియని ఏపీకే ఫైల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని, అలాగే 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్), 87126 56425 (షీ టీమ్స్), 14416 (టెలీ మానస్) వంటి అత్యవసర నంబర్లను ప్రతి ఒక్కరూ తమ ఫోన్లలో భద్రపరుచుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పిల్లల ఎత్తు, బరువులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ఎదుగుదల లోపం ఉన్నవారికి ప్రత్యేక వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 'డిజిటల్ అరెస్ట్' కేసులు నమోదు కాలేదని, అయితే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫోటోలను షేర్ చేయవద్దని, అకౌంట్ సెట్టింగ్స్‌ను 'ప్రైవేట్'లో ఉంచుకోవాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలపై మాట్లాడుతూ, ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు పెట్టుకోవాలని అన్నారు.ఇటీవల హెల్మెట్ లేకపోవడం వల్ల జరిగిన ప్రాణనష్టాలను గుర్తు చేస్తూ, ట్రాఫిక్ నిబంధనల పాటించడం వల్ల ప్రాణాలు కాపాడుకోవచ్చని తెలిపారు. గ్రామంలోని రోడ్ సేఫ్టీ కమిటీలు ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, డీఎస్పీ నాగేంద్రాచారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ, తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ శశికళ, సర్పంచ్ గన్నారం వసంత తదితరులు పాల్గొన్నారు.

## వేసవికాలం దృష్ట్యా ప్రజల దాహార్తి
## తీర్చడానికి మజ్జిగ వితరణ.



హుస్నాబాద్ ఏప్రిల్ 29 (తెలంగాణ వాణి ఆర్ సి) హుస్నాబాద్ పట్టణంలోని మేడిబావి వీధిలో ఉన్న సృజన మ్యాచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని బాటసారులకు ఉపశమనం కలిగించే విధంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.మండుతున్న ఎండల నేపథ్యంలో దాహార్తి తీర్చేందుకు ఈకార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.ఈ సందర్భంగా సృజన మ్యాచింగ్ సెంటర్ నిర్వాహకురాలు సృజన సంపత్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం వేసవి కాలంలో ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ప్రజలకు కొంతమేర ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో మజ్జిగ పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. స్థానికులు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మంది చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రాంతీయ ప్రజలు, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ వాణి

గురువారం, ఏప్రిల్ 30, 2026

## బుగ్గారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అధిక శాతం ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు

జగిత్యాల /బుగ్గారం: 29 ఏప్రిల్ (తెలంగాణ వాణి విలేకరి) జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రములో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలో 121 మంది ప్రభుత్వ, విద్యార్థులు ఉండగా 25 మంది ప్రైవేట్ మొత్తం146 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా మొత్తం 146 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. సిరికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన టి.అభినయ 564 మార్కులు, కె. దీక్షిత 563 అత్యధిక మార్కులు సాధించి మండల టాపర్లు గా నిలిచినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందిస్తూ ముందు ముందు కూడా ఇదే మాదిరిగా అధిక శాతం మార్కుల ఉత్తీర్ణత పొంది ప్రభుత్వ పాఠశాల పేరు గాంచేలా ముందుకి ఎదగాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తూ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు అభినందిచారు.

## ప్రభుత్వ పాఠశాలల ప్రభంజనం

### పదిఫలితాల్లో ధర్మారం మండలం

### అద్భుత ప్రతిభ - 99.3శాతం ఉత్తీర్ణత

ధర్మారం: ఏప్రిల్ 29 (తెలంగాణ వాణి )పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ధర్మారం మండలం అద్భుత ఫలితాలతో దూసుకెళ్లింది. 99.3 శాతం ఉత్తీర్ణతతో అద్భుత ప్రతిభ కనబరిచిందని మండల విద్యాధికారి ప్రభాకర్ గారు తెలిపారు.ఈ ఏడాది మండలం నుండి మొత్తం 710 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరుకాగా వారిలో 705 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుండి 177 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 173 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో పత్తిపాక ఉన్నత పాఠశాల విద్యార్థిని భైరి మనస్విని 600/570 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. మండలంలోని పెరుకపల్లి, మల్లాపూర్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల, పత్తిపాక, కటికెనపల్లి, కొత్తూరు, దొంగతుర్తి, నర్సింహులపల్లి, రచ్చపల్లి ఉన్నత పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు పొందాయన్నారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి ప్రభాకర్ మాట్లాడుతూ అద్భుత ఫలితాలు సాధించిన అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులను,ఉపాధ్యాయ బృందాన్ని, ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రభంజనం.

ఇబ్రహీంపట్నం (తెలంగాణ వాణి విలేకరి) పదవ తరగతి ఫలితాలలోఇబ్రహీంపట్నం మండలంలోనీ ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని మండల విద్యాధికారి బండారి మధు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఉత్తీర్ణత శాతం 99.33శాతం గా ఉందని అదేవిధంగా గోధురు ఉన్నత పాఠశాలలో చదివిన ప్రణీత 578 మార్కులతో మండలంలో మొదటి స్థానం,హర్షిని 569 మార్కులతో రెండవ స్థానం సాధించారని తెలపారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి విద్యార్థులను అభినందించారు.

## మైతాపూర్ గ్రామంలో రక్త దాన శిబిరం



రాయికల్ (తెలంగాణ వాణి) రాయికల్ మండలం మైతాపూర్ గ్రామంలో బుధవారం రోజున ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జగిత్యాల శాఖ, మరియు మైతాపూర్ గ్రామ యువత ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ నీలారపు శ్రీనివాస్ మరియు ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. డాక్టర్ నీలారపు శ్రీనివాస్ మాట్లాడుతూ రక్తదానం అనేది మనం చేయగలిగే అత్యంత గొప్ప సేవ. ఒక్క రక్తదానం ద్వారా ప్రమాదాల్లో గాయపడినవారు, శస్త్రచికిత్సలో ఉన్నవారు, ప్రసూతి స్త్రీలు, చిన్నపిల్లలు వంటి అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చు అని వారు తెలిపారు. గ్రామంలోని 35 మంది రక్తదానం చేశారు.కార్యక్రమంలో ఇన్చార్జి సూపర్డెంట్ ఆఫ్ జనరల్ హాస్పిటల్ జగిత్యాల డాక్టర్ విజయ్, గ్రామ సర్పంచ్ తలారి నాగమణి రాజేష్ మరియు వార్డ్ మెంబర్లు, బత్తిని శ్రీనివాస్, పరమేష్, కొల్లవేణు నేమిళ్ల స్వామి రెడ్డి, బూస గంగ మల్లయ్య అనుమల సత్యనారాయణ గ్రామ ప్రజలు యువకులు రక్తదానం చేశారు. రక్తదాన శిబిర నిర్వాహకులు దొంగ జితేందర్, సద్ది మహిపాల్, మోత్కూరి శ్రీనివాస్, రాజనాల మధు,అమరేందర్,శివనితి గంగారెడ్డి, రక్త దాతలు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## రసాయన శాస్త్రంలో వై.బాలాజీరావుకు పీహెచ్.డీ



పటాన్ చెరు, ఏప్రిల్ 29, (తెలంగాణ వాణి రిపోర్టర్) హైదరాబాదు లోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి వై. బాలాజీరావు (ఎన్.ఎఫ్.సీ. హైదరాబాదు పూర్వ జనరల్ మేనేజర్) డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'భారత అణు ఇంధన సబ్-అసెంబ్లీ తయారీ ప్రక్రియలో ఉపయోగించే యురేనియం, జిర్కోనియం, జిర్కోనియం ఆధారిత మిశ్రమ లోహాలు, ఉక్కుల రసాయన లక్షణాల నిర్ధారణ కోసం కొత్త విశ్లేషణాత్మక అనువర్తనాల అభివృద్ధికి ఒక నూతన, క్రమబద్ధమైన అధ్యయనం' చేసి, ఆయన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పీ.వీ. నాగేంద్ర కుమార్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. విశ్లేషణాత్మక కచ్చితత్వం, సామర్థ్యం, సుస్థిరతను మెరుగు పరచడానికి ఈ అధ్యయనం అయాన్ క్రోమాటోగ్రఫీ (ఐసీ), ఇండక్టివ్లీ కపుల్డ్ ప్లాస్మా-అటామిక్ ఎమిషన్ స్పెక్ట్రోస్కోపీ (×జూ-ూజూ) గ్లో డిశ్చార్జ్ ఆప్టికల్ ఎమిషన్ స్పెక్ట్రోస్కోపీ (+ణ-ాజూ) వంటి అధునాతన పద్ధతులను సమన్వయం చేస్తుందని తెలియజేశారు. విశ్లేషణాత్మక వ్యర్థాలను, నిర్వహణ ఖర్చులను తగ్గిస్తూ, వేగవంతమైన, అధిక-ఉత్పత్తి విశ్లేషణను సాధ్యంచేసే అనేక వినూత్న పద్ధతులను డాక్టర్ బాలాజీరావు అభివృద్ధి చేశారన్నారు. ఆయన చేసిన కృషి, ఘన నమూనాల విశ్లేషణ, రామన్ స్పెక్ట్రోస్కోపీని ఉపయోగించి ఆన్ లైన్ ప్రక్రియ పర్యవేక్షణ, జూ-ాూూ యొక్క విస్తరించిన అనువర్తనాల తో సహా, భవిష్యత్ దృష్టితో కూడిన విధానాలను కూడా ప్రతిపాదిస్తుందని తెలిపారు. ఇవి అణు పదార్థాలలో నాణ్యత హామీని మెరుగు పరచడానికి దోహదపడతాయన్నారు.

ఈ అధ్యయనం, అణు ఇంధన సంస్థ (ఎన్.ఎఫ్.సీ) వద్ద ఉన్న కీలకమైన విశ్లేషణాత్మక సవాళ్లను పరిష్కరిస్తుందని, భారతదేశపు అణుశక్తి, హరిత ఇంధన కార్యక్రమాలకు మద్దతు ఇస్తుందని తెలియజేశారు.డాక్టర్ బాలాజీరావు సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# పార్టీ పెట్టే అన్ని డబ్బులు కవితకు ఎక్కడివి..?

**- కేసీఆర్ కుటుంబం ముందు ఆస్తి తగాదాలు పరిష్కరించుకోవాలి**

**- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



ధర్మారం (తెలంగాణ వాణి) మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం అక్రమంగా సంపాదించిన ఆస్తుల పంచాయితీ పరిష్కరించుకున్న తర్వాత ప్రజా ప్రభుత్వం పై విమర్శలు చేయాలని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుధవారం ధర్మారం వ్యవసాయ మార్కెట్ లో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని అధికారులు నాయకులతో కలిసి మంత్రి ప్రారంభించారు. నంది మేడారం, చామనపల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు రేవంత్ రెడ్డి దిగిపోవాలి బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని హరీష్ రావు తో పాటు కొత్తగా పార్టీలో చేరిన జీవన్ రెడ్డి మాట్లాడటం విడ్డురమని కల్వకుంట్ల కుటుంబం ముందు ఆస్తుల పంచాయతీ పరిష్కరించుకున్న తర్వాత ప్రజా ప్రభుత్వంపై మాట్లాడాలని మంత్రి సూచించారు. అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు దిగిపోవాలో తెలుపాలని మంత్రి ప్రశ్నించారు. కేసీఆర్ కూతురు కవితకు పార్టీ పెట్టె అన్ని డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని మంత్రి అడ్లూరి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్న రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మక్కజొన్న కొనుగోలు కేంద్రాలు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందని ఆయన తెలిపారు.మక్కజొన్న రైతులకు మద్దతు కల్పించాలని మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటాలుకు రూ. 2400 మద్దతు ధర చెల్లిస్తుందని మంత్రి తెలిపారు. మక్కజొన్న రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకొని రైతులు మద్దతు ధర పొందాలని మంత్రి పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించి చేతులు దులుపుకుంటుందని మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. గత ఖరీఫ్ సీజన్ లో రైతుల వద్ద సేకరించిన ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వం ఎఫ్ సీఐ ద్వారా వెంటనే సేకరించి యాసంగి ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. రబీ సీజన్ లో రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు.చామనపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఇరిగేషన్ శాఖ ద్వారా సంప్రదింపులు జరిపి కొనుగోలు కేంద్రానికి స్థలం కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. నూతనంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్ద బోరుబావి తవ్వించడంతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పిస్తానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. గ్రామంలో అంబేద్కర్ భవనం ఏర్పాటు తోపాటు ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ డి శ్రీనివాస్, ఎంపీడీవో వేముల సుమలత, ఏఎంసీ చైర్మన్ ఎల్ రూప్ల నాయక్, వైస్ చైర్మన్ అరిగే లింగయ్య, నాయకులు కొత్త నరసింహులు, కొడారి అన్నయ్య, దేవి జనార్ధన్, దాగేటి ఉదయ్ యాదవ్, వేల్పుల నాగరాజు, సాగంటి కొండయ్య,ఓడ్నాల శంకరయ్య, టి సతీష్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఏఎంసీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

## రాష్ట్ర ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఘన సన్మానం

### ఒలంపియాడ్ పరీక్షల్లో ఎస్ఆర్ఎఫ్ దిట్ట..



తెలంగాణ వాణి, ఉమ్మడి వరంగల్ బ్యూరో (ఏప్రిల్ 29) ఒలంపియాడ్ పరీక్షల్లో ఎస్ఆర్ఎఫ్ దిట్ట అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. హైదరాబాదులోని శిల్పకళా వేదికలో శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ అమరేష్ సభాధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో ఒలింపియాడ్ పరీక్షల అతిపెద్ద నిర్వాహకులు,శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ అని,రాష్ట్ర స్థాయి లో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించి వేలాది మంది విద్యార్థులకు రాష్ట్ర జిల్లా స్థాయిలలో ప్రథమ ద్వితీయ తృతీయ ర్యాంకులు సాధించినటువంటి వారికి ఘనంగా సన్మానించారు. మాతృభాష గొప్పదని, తల్లిదండ్రులను గురువులను గౌరవించాలని విద్యార్థులకు బోధించారు. తాను ఎంతో కష్టపడి ఈ స్థాయికి ఎదగానని చెప్పారు. రాష్ట్రస్థాయిలలో అత్యుత్తమ రదిభ కనబరిచినటువంటి విద్యార్థుల కుటుంబ సభ్యులు, పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు. అవార్డు గ్రహీతలకు వెంకయ్య నాయుడు మెమెంటో, ప్రశంస పత్రంతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, సీతక్క,కాజిపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ ఎస్. వెంకట్ నారాయణ,యు బ్లడ్ ఆప్ సృష్టికర్త డాక్టర్ జై జగదీష్ బాబు యలమంచిలి ,అన్నం ఫౌండేషన్ వ్యవస్థాపకులు అన్నం శ్రీనివాసరావు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### జిల్లాలో ముమ్మరంగా అవగాహన సదస్సులు




పరిగి: ఏప్రిల్ 29 ( తెలంగాణ వాణి ప్రతినిధి) తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతోంది. ఈ ప్రణాళికలో భాగంగా "బాలల భద్రత, రక్షణ మరియు డ్రగ్స్ రహిత సమాజం" లక్ష్యంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ఊపందుకున్నాయి. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్ మార్గదర్శకత్వంలో జిల్లా పోలీసు యంత్రాంగం క్షేత్రస్థాయిలో ప్రజలను, విద్యార్థులను చైతన్యపరుస్తోంది. ముఖ్యంగా నేటి డిజిటల్ యుగంలో పొంచి ఉన్న ముప్పులను గుర్తించిన అధికారులు, నేడు జిల్లావ్యాప్తంగా "సైబర్ నేరాలు - తీసుకోవాల్సిన జాగ్రత్తలు" అనే అంశంపై ప్రత్యేక సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ, అమాయక ప్రజలే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు కొత్త పుంతలు తొక్కుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సమాజంలో కలకలం రేపుతున్న లోన్ యాప్‌ల వేధింపులు, ఓటిపి షేరింగ్ మోసాలు, అధిక లాభాలు ఆశజూపే నకిలీ పెట్టుబడి పథకాలు, మరియు సామాజిక మాధ్యమాల వేదికగా సాగుతున్న వేధింపుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ?ఫోన్లకు వచ్చే గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయడం వల్ల డేటా చోరీకి గురయ్యే ప్రమాదం ఉందని, వ్యక్తిగత సమాచారాన్ని గానీ, బ్యాంకింగ్ వివరాలను గానీ ఎట్టి పరిస్థితుల్లోనూ అపరిచితులతో పంచుకోవద్దని స్పష్టం చేశారు. ఒకవేళ ఎవరైనా పొరపాటున సైబర్ మోసానికి గురైతే, ఏమాత్రం భయపడకుండా లేదా ఆలస్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. బాధితులు వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్ 1930 కు కాల్ చేయాలని లేదా అధికారిక వెబ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయాలని కోరారు. మోసం జరిగిన మొదటి రెండు గంటలను 'గోల్డెన్ అవర్'గా పరిగణించి ఫిర్యాదు చేస్తే, పోగొట్టుకున్న నగదును తిరిగి పొందే అవకాశం మెరుగ్గా ఉంటుందని ఈ సందర్భంగా అధికారులు వివరించారు. ఈ ప్రగతి ప్రణాళిక ద్వారా సురక్షితమైన మరియు నేరరహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని జిల్లా పోలీస్ యంత్రాంగం పిలుపునిచ్చింది.

## వెంకటాపూర్ లో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి



వనపర్తి , ఏప్రిల్ 29, (తెలంగాణ వాణి ప్రతినిధి ): వనపర్తి మండలం వెంకటాపూర్ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులు వారి ఖాతాల్లో నేరుగాపడతాయని చిన్నా రెడ్డి గారు అన్నారు, గ్రేడ్-ఏ రకం (సన్నాలు) ధాన్యం క్వింటాకు రూ.2,389, సాధారణ రకం క్వింటాల్ కు రూ.2,350 మద్దతు ధర ఇస్తామని, సన్నరకం ధాన్యం క్వింటాల్ కు రూ.500 రూపాయల బోనస్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందని అన్నారు. వరి కొనుగోలు దగ్గర గన్ని బ్యాగులు కొరత లేకుండా చూసుకోవాలని నిర్వాహలకు సూచించారు. రైతుల తమ ధాన్యాన్ని దళారులకు అమ్ముకోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని అమ్మాలని రైతులకు సూచించారు. రైతు పండించిన ప్రతి గింజను చివరి వరకు ప్రజా ప్రభుత్వం కొంటుంది అని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని అధికారులకు సూచనలు ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, వనపర్తి మండల్ కిసాన్ సెల్ అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి, వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ పృధ్వినాథ్ రెడ్డి, గ్రామ రైతులు అధికారులు పాల్గొన్నారు.

## పదో తరగతి ఫలితాల్లో సిరిపురం విద్యార్థుల ప్రభంజనం

### ముగ్గురు విద్యార్థుల అద్భుత విజయం

మర్పల్లి (తెలంగాణ వాణి ప్రతినిది) మర్పల్లి, వికారాబాద్ జిల్లాలో విడుదలైన పదవ తరగతి ఫలితాలలో వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం సిరిపురం గ్రామానికి చెందిన విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి తమ గ్రామ కీర్తిని చాటారు. గ్రామానికి చెందిన ఎర్రోళ్ల వైష్ణవి, ఎర్రోళ్ల అర్చన మరియు ఎర్రోళ్ల మహంత్ కుమార్ విద్యా సంవత్సరం పొడవునా పట్టుదలతో శ్రమించి అత్యుత్తమ మార్కులు సాధించారు. వైష్ణవి 525 మార్కులతో అగ్రస్థానంలో నిలవగా, అర్చన 479 మార్కులు, మహంత్ కుమార్ 422 మార్కులతో ఉత్తీర్ణత సాధించి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు.ముగ్గురు విద్యార్థులు ఒకే గ్రామం నుండి ఇంతటి ఘన విజయాన్ని నమోదు చేయడం పట్ల స్థానికంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థుల కష్టానికి, క్రమశిక్షణకు ఈ ఫలితాలు నిదర్శనమని గ్రామస్థులు మరియు విద్యావంతులు కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మరియు కుటుంబ సభ్యులు తమ పిల్లల విజయం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో వారు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ అద్భుత విజయాన్ని సాధించిన వైష్ణవి, అర్చన మరియు మహంత్ కుమార్‌లకు వికారాబాద్ జిల్లా ప్రతినిధులు మరియు మండల ప్రముఖులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి ఉజ్వల భవిష్యత్తుకు శుభాశీస్సులు అందించారు.

## బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గా కొయ్యడ శేఖర్ గౌడ్ ఎన్నిక



చౌటుప్పల్ (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి) చౌటుప్పల్ మున్సిపాలిటి ఎన్నికలలో బి.ఆర్.ఎస్. పార్టీ తరఫున గెలిచిన కౌన్సిలర్ల అందరి ఏకాభిప్రాయం ప్రకారం 5వ వార్డు కౌన్సిలర్ గా గెలిచిన కొయ్యడ శేఖర్ గౌడ్ ను బి.ఆర్.యస్. పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గా ఎన్నుకోవడం జరిగినది. ఈ నియామక పత్రాన్ని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఉదరి యాదయ్య, బి ఆర్ ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు గిర్కటి నిరంజన్ గౌడ్, మాజీ జెడ్పిటిసి సభ్యులు పెద్దిటి బుచ్చిరెడ్డి, తంగడపల్లి మాజీ సర్పంచ్ దయాకర్ చారి, నాయకులు గడ్డం రాజరత్నం, తాడూరు పరమేష్, దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

RNI No. APTEL/2012/53127
TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక
The Voice of Telangana



# కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపించాలి

## జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్



సూర్యాపేట బ్యూరో (తెలంగాణ వాణి) వర్ష సూచనను దృష్టిలో ఉంచుకొని కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. బుధవారం సూర్యాపేట మండల కేంద్రంలోని గాంధీ నగర్ పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్నీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షానికి కొనుగోలు కేంద్రాలలో దాన్యం తడవకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వర్షం వస్తే ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్లు కప్పి ఉంచాలని, అదేవిధంగా ధాన్యం కొన్న తర్వాత మిల్లులకు తీసుకువెళ్లే లారీలు, వాహనాలపై కూడా టార్పాలిన్లు కప్పి ఉంచాలని చెప్పారు. ఆనంతరం నవరత్న పార్ బాయిల్డ్ రైస్ మిల్ ను ధాన్యం దిగుమతులను పరిశీలించారు. కొనుగోలు కేంద్రల నుండి మిల్లుకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రలలో టెంట్, మంచినీరు, ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమం లో ఆర్డిఓ వేణు మాధవ రావు, తహసీల్దార్ కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

## రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశ చేస్తున్న సర్పంచ్ కావిరి అర్జున్



ఏటూరునాగారం (తెలంగాణ వాణి) ఏటూరునాగారం మండలం రొయ్యూరు గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మాణం పూర్తి చేసుకున్న గృహంలో నేడు గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ లబ్ధిదారులు జోడే నరసయ్య దంపతులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, తమలాంటి పేద కుటుంబాలకు ఇల్లు మంజూరు చేసినందుకు రాష్ట్ర మంత్రి సీతక్కకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గృహప్రవేశ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ కావిరి అర్జున్ చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్థులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. లబ్ధిదారులు మాట్లాడుతూ"సీతక్క సహకారంతో మా కుటుంబానికి శాశ్వత నివాసం కలగడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ రోజు మా జీవితంలో చిరస్మరణీయంగా నిలిచిపోతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమం రొయ్యూరు గ్రామంలో పండుగ వాతావరణాన్ని తలపించింది.

# పది ఫలితాల్లో తెల్లాపూర్ జెడ్‌పిహెచ్ఎస్ విద్యార్థుల 100శాతం ఉత్తిర్ణత

రామచంద్రపురం/తెల్లాపూర్ (తెలంగాణ వాణి ప్రతినిధి) తెల్లాపూర్‌లోని జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఎస్ఎస్‌సీ ఫలితాలు అద్భుతంగా వచ్చాయి. ఈసారి పాఠశాల 100శాతం పాస్ శాతం సాధించడం విశేషం. మొత్తం 81 మంది విద్యార్థుల్లో 56 మంది 500కి పైగా మార్కులు సాధించడం పాఠశాల ప్రతిష్టను మరింత పెంచింది. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను ప్రధానోపాధ్యాయులు భాస్కర్ గారు ప్రశంసించారు. కష్టపడి చదివిన ప్రతి విద్యార్థి ఈ విజయానికి కారణమని, ఉపాధ్యాయుల శ్రమ మరియు తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని ఆయన పేర్కొన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల్లో జి.హర్షి (574), ఎం.ఇందు (570), కె.భార్గవి (568), ఐ.వైష్ణవి (563), డి.రశ్మిత (561), ఆర్.అఖిల (560), డి.కళాపన (560)లు నిలిచారు. వీరి విజయాలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా తెల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సీపీ రెడ్డి గారు ప్రధానోపాధ్యాయులు భాస్కర్ ను, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని, ఇలానే భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. స్థానిక ప్రజలు, తల్లిదండ్రులు కూడా విద్యార్థుల విజయాన్ని సంబరంగా జరుపుకుంటూ పాఠశాల సిబ్బందికి అభినందనలు తెలిపారు.

# బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవం పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



సిద్దిపేట (తెలంగాణ వాణి ప్రతినిధి) సిద్దిపేట జిల్లా, చేర్యాల మండలంలోని కడవేర్గు గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ విజయ దుర్గా దేవి సహిత నాభిశీల (బొడ్రాయి) ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో జనగామ శాసనసభ్యులు డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొని, గ్రామస్తులు, భక్తులతో కలిసి దేవి ప్రతిష్టా మహోత్సవ వేడుకలో పాల్గొన్నారు. ఈ మహత్తరమైన కార్యక్రమానికి నన్ను ఆహ్వానించి ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు నాకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. దేవి ఆశీస్సులతో గ్రామం అభివృద్ధి చెందాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని వర్షాలు సమృద్ధిగా కురవాలని రైతులందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు వారన్నారు. భక్తులందరికీ సుఖశాంతులు కలగాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాళ్లపల్లి రమేష్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కస్తూరిబాగాంధీ పాఠశాల ప్రభంజనం

## ఎస్ఎస్‌సి ఫలితాల్లో మండల టాపర్‌గా చిలుముల శ్రావణి

కన్నాయిగూడెం (తెలంగాణ వాణి) ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని ముప్పనపల్లి గ్రామంలో ఉన్న కస్తూరిబాగాంధీ ప్రభుత్వ పాఠశాల వరుసగా ఐదుసార్లు మండలంలో మొదటి స్థానంలో నిలిచింది కస్తూరిబాగాంధీలో ప్రతిభకు ఏమాత్రం కొదవ లేదని ప్రతిసారి నిరూపిస్తుంది. తాజాగా విడుదలైన ఎస్ఎస్‌సి ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన చిలుముల శ్రావణి 538 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచి విశేష ప్రతిభ కనబర్చింది. ఎర్రవుల రాఘవి 524మార్కులు సాదించి మండలంలో రెండవ స్థానంలో నిలిచింది గూర్రేవుల ప్రభుత్వ పాఠశాల నుంచి తునికి నంద కిశోర్ 518మార్కులు సాదించి మూడవ స్థానంలో నిలిచింది వీళ్ళు చిన్నప్పటి ప్రభుత్వ పాఠశాలలోనే విద్యను అభ్యసిస్తున్నారు.ఈసందర్భంలో కస్తూరిబాంధీ ప్రభుత్వ పాఠశాల ఎస్ఓ అశ్విని మాట్లాడుతూ చదువులో క్రమశిక్షణ,పట్టుదలతో ముందుకు సాగిన ఈ విద్యార్థులు అన్ని విషయాల్లోనూ ప్రతిభ కనబరుస్తూ వచ్చారు ఇప్పుడు మంచి మార్కులు సాదించి కన్నాయిగూడెం మండలానికి మంచి పేరు తెచ్చారని అన్నారు అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయుల ప్రశంసలు పొందారు. పాఠశాల స్థాయి పరీక్షల నుంచే తన ప్రతిభను చాటుకున్న ఈ విద్యార్థులు, ఎస్ఎస్‌సి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించి మండల స్థాయిలో అగ్రస్థానంలో నిలవడం విశేషమని వీళ్ళు సాధించిన విజయంతో కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజల్లో ఆనందం వెల్లివిరిసిందని అన్నారు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో 6మంది విద్యార్థులకు 500కు పైగా మార్కులు సాధించగా,100 శాతం ఉత్తీర్ణత కస్తూరిబాగాంధీ ప్రభుత్వ పాఠశాల,ముప్పనపల్లి ప్రభుత్వ పాఠశాల,ఆశ్రమ ప్రభుత్వ గిరిజన సంక్షేమ పాఠశాల నమోదు కావడం గమనార్హం. నాణ్యమైన బోధన,ఉపాధ్యాయుల కృషి,విద్యార్థుల పట్టుదల కలిసొస్తే ప్రభుత్వ పాఠశాలలు కూడా అగ్రస్థానాల్లో నిలవగలవని ఈ ఫలితాలు స్పష్టం చేశాయి

# తెలంగాణ జన సమితి ఆవిర్భావ వేడుకలు



వనపర్తి : ఏప్రిల్ 29, తెలంగాణ వాణి ప్రతినిధి ): తెలంగాణ జన సమితి పార్టీ 8వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను వనపర్తి జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారుబుధవారం రోజున జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జన సమితి జిల్లా అధ్యక్షులు ఎం.ఏ. ఖాదర్ పాషా ముఖ్య అతిథిగా హాజరై జయశంకర్, అంబేద్కర్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. జిల్లాలో పార్టీ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఖాదర్ పాషా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏ ఆశయాల కోసం అయితే ఏర్పడిందో, జయశంకర్ ఆశయాలు నెరవేరాలంటే జన సమితి వంటి ప్రజా పక్షపాత్ర పార్టీల అవసరం ఎంతైనా ఉందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలతో పాటు సామాజిక న్యాయం అందించడమే పార్టీ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. పార్టీ జెండా ఎగురవేసిన అనంతరం తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ నివాళులర్పించారు.ప్రొఫెసర్ కోదండరాం అడుగుజాడల్లో నడుస్తూ, వనపర్తి జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, ఇతర అభివృద్ధి పనులపై రాజీలేని పోరాటం చేస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు యం.ఏ.ఖాదర్ పాష, జిల్లా ఉపాధ్యక్షులు గండు శివ,జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి షఫీ,టౌన్ ప్రధాన కార్యదర్శి శాంతారాం నాయక్, రతన్ నాయక్, చంద్రశేఖర్, ఎండి గౌస్ పాషా కమిటీ సభ్యులు, మండల నాయకులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాం సాగర్ గ్రామంలో చలివేంద్రంను ప్రారంభించిన గ్రామ సర్పంచ్

## చత్రపతి శివాజీ మహారాజ్ యూత్ సభ్యులకు అభినందనలు తెలిపిన గ్రామ సర్పంచ్




కొమురవెల్లి (తెలంగాణ వాణి ప్రతినిధి) సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని రాంసాగర్ గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ యూత్ వారి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రాం సాగర్ గ్రామ సర్పంచ్ అక్కేనపల్లి రాజ్యాలక్ష్మి మల్లారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ అక్కేనపల్లి రాజ్యాలక్ష్మి మల్లారెడ్డి మాట్లాడుతూ: ఈ వేసవి కాలంలో యువత మంచి ఆలోచన చేసినందుకు చత్రపతి శివాజీ మహారాజ్ యూత్ సభ్యులకు అభినందించారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు గ్రామంలో మరెన్నో చేయాలని యువత చెడు వ్యసనాలు బారిన పడకుండా ఇలాంటి మంచి కార్యక్రమంలో ముందుండి నడవాలని వారు కొనియాడారు. మంచి పనులు చేయడానికి యువతకు నా సహయ శక్తుల నా వంతు సహాయం చేయడానికి ఎల్లవేళలా కృషి చేస్తారని వారన్నారు. ఈ వేసవి కాలంలో సాధ్యమైనంతవరకు ఎండలు అధికంగా ఉన్నందున బయటకు వెళ్లకుండా ప్రయత్నం చేయాలని అత్యవసరమైతేనే బయటకు రావాలని ఎక్కువ ఎండలు తీవ్రత ఉన్నందున ఎక్కువ నీటిని సేవించాలని వారు సూచించారు. యువత పిల్లలు చెరువుల దగ్గరికి కుంటల దగ్గరికి బావుల దగ్గరికి ఈత నేర్చుకోవడానికి స్నానాలు చేయడానికి వెళ్లకూడదని వారు సూచించారు. యువత ఇప్పుడు కష్టపడి ఇష్టంతో చదువుకొని భవిష్యత్తులో రాం సాగర్ గ్రామానికి వన్నె తెచ్చే విధంగా (మంచి పేరు ప్రఖ్యాతలు) ఉండాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఏసి రెడ్డి మల్లారెడ్డి, వార్డు సభ్యులు, చత్రపతి శివాజీ మహారాజ్ యూత్ సభ్యులు మరియు గ్రామ పెద్దలు మహిళలు యువకులు పిల్లలు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో అంజన్న పడిపూజలు భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి.



నిర్మల్ – భైంసా: ఏప్రిల్ 29 (తెలంగాణ వాణి ప్రతినిధి) నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో అంజన్న పడిపూజలు భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్ రావు పటేల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన హనుమాన్ స్వామివారిని భక్తితో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాము స్వామి ఆధ్వర్యంలో జరిగిన హనుమాన్ దీక్ష పడిపూజలు అత్యంత వైభవంగా జరిగాయి.వేద మంత్రాల నడుమ భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మోహన్ రావు పటేల్ ముధోల్ నియోజక వర్గ ప్రాంత ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

# అనాధ బాలుడికి ఆవిర్భావ్ గా నామకరణం చేసిన ఎమ్మెల్యే దంపతులు

## – ఆవిర్భవ్ పోషణకు ప్రభుత్వం తరుపున 1లక్ష 90 వేల రూపాయల చెక్కు అందజేసిన వెడ్మ బొజ్జు పటేల్



ఉట్నూర్ (తెలంగాణ వాణి ) ఉట్నూర్ మండలం రాంజీగోండ్ నగర్ కి చెందిన ఆత్రం గంగుబాయి బిడ్డకు జన్మనిచ్చి స్వర్గస్తులయ్యారు వారి భర్త కూడా గంగుబాయి మరణించిన నెల రోజుల క్రితం చనిపోయారు వారికి రెండేళ్ల పాప కూడా ఉన్నారు, తల్లితండ్రులను కోల్పోయిన ఆ పసిపిల్లలు అనాదాలయ్యారు, ఈ వార్త విన్న నిర్మల్ డిసిసి అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మార్చి నెలలోనే వారి ఇంటికి వెళ్లి పిల్లలకు అండగా నిలుస్తానని, పసి పిల్లాడు పెద్దయ్యేవరకు పాల,పౌష్టికాహారం ఖర్చు ఎమ్మెల్యే చూసుకుంటానని మాట ఇచ్చారు,ప్రభుత్వం తరుపున కూడా సహాయం అందించడానికి కృషి చేస్తానన్నారు . ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం తరుపున ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తల్లితండ్రులు లేని ఆ పిల్లలకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ దంపతులు అన్ని తామై వారి చేతుల మీదుగా ఆ బాలుడికి అవిర్భావ్ గా నామకరణం చేశారు.ప్రభుత్వం తరుపున ఆవిర్భవ్ పోషణకు 1లక్ష 90 వేల రూపాయల చెక్కు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పసిబిడ్డ జీవితంలో గొప్పగా ఎదగాలని ఆయన జీవితం సమాజంలో ఉన్నత స్థాయిలో ఆవిర్భవించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే దంపతులు కలిసి ఆలోచన చేసి అవిర్భవ్ అని నమరకణం చేస్తున్నాం అన్నారు.ఈ కార్యక్రమంలో పివిటిజి ఏపీవో ఆత్రం భాస్కర్, డి ఈ వో, బాలుడి నాన్నమ్మ గ్రామస్తులు , కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి



నిర్మల్ – తానూర్ (తెలంగాణ వాణి ప్రతినిధి) నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని హిపనెల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. పిల్లోడే పోసాని సిద్దుకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు, సర్పంచ్ చంద్రే గంగసాగర్,శివరాం చేతుల మీదుగా ప్రారంభించబడింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ముధోల్ మాజీ శాసనసభ్యులు జి. విట్టల్ రెడ్డి మాట్లాడుతూ

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నారని తెలిపారు. ప్రతి గ్రామంలో ఈ ఇళ్ల నిర్మాణం వేగంగా కొనసాగుతుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి,గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారికి,అలాగే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు గారికి ముధోల్ నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ రాజన్న,మాజీ ఆత్మ చైర్మన్ పోతరెడ్డి, ఉపసర్పంచ్ గంగాధర్, వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు మరియు తదితరులు తరులు పాల్గొన్నారు.

# భైంసాలో చలివేంద్రం ప్రారంభం




నిర్మల్– భైంసా: ఏప్రిల్ 29 (తెలంగాణ వాణి ప్రతినిధి) వేసవి వేడి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించే ఉద్దేశంతో పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ రావుల సువర్ణ పోశెట్టి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ

వేసవిలో ప్రజలకు చల్లని తాగునీరు అందించడం సేవా కార్యక్రమాల్లో అత్యంత ముఖ్యమని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి,కౌన్సిలర్లు,స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# చెట్టు పై నుండి పడి వ్యక్తి కి తీవ్ర గాయాలు



ఎల్లారెడ్డి (తెలంగాణ వాణి ప్రతినిధి) ఎల్లారెడ్డి మండలం అడవి లింగాల గ్రామానికి చెందిన పిట్ల సంగమేశ్వర్ ఈనెల 24వ తేదీ నాడు తాపీ మేస్త్రి గా పనిచేస్తున్న సంగమేశ్వర్ పని ముగించుకొని సాయంత్రం ఇంటికి వెళ్తూ తన చిన్న పిల్లల కొరకు మామిడికాయలు తెంపడానికి చెట్టు ఎక్కాడు ఎక్కి మామిడికాయలు తెంపుతున్న సమయంలో ప్రమాదవశాత్తు చెట్టుపైకిలి కిందపడి గాయాలు పాలయ్యాడు కింద పడ్డ సమయంలో అక్కడ ఎవరూ లేనందువలన కొంత సమయం స్పృహ తప్పి పోయాడు. మేలుకా వచ్చిన తర్వాత కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు కుటుంబ సభ్యులు హటావోటీన వెళ్లి ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు అక్కడ ట్రీట్మెంట్ కాదు అని హైదరాబాద్ ప్రైవేట్ హాస్పిటల్ కి రిఫర్ చెయ్యడం జరిగింది అక్కడ డాక్టర్లు వేద్య పరీక్షలు చేసి నడుము విరిగినట్టు తెలపడం జరిగింది ఆ విషయం తెలుసుకొని బుధవారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆవుటి.బాబు కార్యదర్శి అబ్దుల్ రజాక్ బుధవారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించడం జరిగింది కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పడం జరిగింది మన సంక్షేమ మండలి నుండి వచ్చే బెనిఫిట్స్ ఇప్పించేతందుకు సంఘం తరపున కృషి చేస్తామని హామీ ఇచ్చారు కష్టం చేస్తే తప్ప ఇల్లు గడవాని స్థితిలో ఉన్న ఈ నిరుపేద కుటుంబానికి స్థానిక ఎమ్మెల్యే ఈ విషయంలో ఆదుకోవాలని ప్రభుత్వం తరఫున సహాయం చేయాలని కోరారు వారి వెంట స్థానిక సంఘం అధ్యక్షులు మార్గం. రవీందర్, పండింటి.సాయిలు, ఎరకల.ప్రకాష్, మన్నే.సాయిబాబు, వడ్డే.రాజేందర్, నాయకులు కార్మికులు అధిక సంఖ్యలో పీట్ల.సంగమేశ్వర్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది

# ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం వేడుకల్లో ఏఎంసి చైర్మన్ రజిత వెంకట్రామ్ రెడ్డి.



ఎల్లారెడ్డి (తెలంగాణ వాణీ ప్రతినిధి) ఎల్లారెడ్డి మండలం వెల్లుట్ల గ్రామంలో నిర్వహించిన నూతన గృహప్రవేశ ఇంద్రమ్మ వేడుకలో పాల్గొనడం ఆనందంగా ఉంది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎల్లారెడ్డి ఏఎంసీ మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకటరమణ రెడ్డి, ఎల్లారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుర్మసాయిబాబా, గ్రామ సర్పంచ్ , ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.
నెలచూపుల రమ్య మరియు పసులాది మైసకల గారి గృహప్రవేశం సందర్భంగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ తరపున నూతన వస్త్రాలు అందజేసి వారిని సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము. ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ, ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలియజేస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింతగా కొనసాగిస్తామని హామీ ఇస్తున్నామన్నారు.

# హుజురాబాద్ డివిజన్ చీటింగ్ కేసుల పురోగతిపై పోలీస్ కమిషనర్ సమీక్ష

**బాధితులకు సత్వర న్యాయం అందించాలి**

**సాంకేతిక ఆధారాలతో విచారణ వేగవంతం చేయాలి: సీపీ గౌస్ ఆలం**



హుజురాబాద్ (తెలంగాణ వాణి) కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం బుధవారం హుజురాబాద్ ఏసీపీ కార్యాలయంలో డివి జన్ స్థాయి పోలీసు అధికా రులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న నేరాల విచారణ తీరును ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.

## చీటింగ్, ఫోర్జరీ కేసులపై ప్రత్యేక దృష్టి

ముఖ్యంగా హుజురాబాద్ డివిజన్ వ్యాప్తంగా నమోదైన చీటింగ్ (మోసపూరిత) ఫోర్జరీ కేసుల ప్రస్తుత స్థితిగ తులపై సీపీ ఆరా తీశారు. అమాయక ప్రజలను మోసం చేసే వ్యక్తులపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న కేసులను సత్వరమే కొలిక్కి తీసుకురావాలని, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. ప్రస్తుత కాలంలో నేరస్తులు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతు న్నారని,వారిని పట్టుకోవడంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఫోరెన్సిక్ ఆధారాలను విరివిగా ఉపయోగించాలని పేర్కొన్నారు. కోర్టులో నేరస్తులకు శిక్ష పడేలా పటిష్టమైన సాక్ష్యాధా రాలతో కూడిన ఛార్జ్ షీట్లను నిర్ణీత గడువులోగా దాఖలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నేరాల నియంత్రణతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ నమ్మకాన్ని పెంపొం దించేలా విధులు నిర్వహించాలని సీపీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ ఏసీపీ వి.మాధవి, స్థానిక ఇన్స్పెక్టర్లు కరుణాకర్, శ్రీనివాస్, రామకృష్ణ, ఎస్సైలు ఆవుల తిరుపతి, స్వాతి, క్రాంతిలతో పాటు ఇతర పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# దాన్యం కొనుగోళ్లలో మిల్లర్లు అధికారులు, రైతులను అరిగోస పెడుతున్నరు

**కొనుగోలు కేంద్రాల నుండి దాన్యాన్ని తక్షణమే తరలించాలి**

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వీడాలి**

**సిపిఎం నేత సాధం రమేష్ డిమాండ్**



జనగామ (తెలంగాణ వాణి ప్రతినిధి) యాసంగి పంట ధాన్యం సేకరణ,కొనుగోలు ప్రక్రియలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సమస్యను తన పాలేర్లకు అప్పగిస్తే,వాళ్ళు చెప్పులు గొంగడి నాది కాదు మా పటేల్ చూడాలె అనే రీతిలో బాధ్యతా రాహిత్యాన్ని ప్రదర్శిస్తున్నరని సీపీఎం పార్టీ చిల్పూర్ మండల ప్రధాన కార్యదర్శి సాధం రమేష్ ప్రభుత్వం,అధికారుల,తీరుపై మండిపడ్డారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బాధ్యతారాహిత్యాన్ని విడనాడి,రైతుల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు.గత రెండు రోజుల నుండి తన నేతృత్వంలోని సీపీఎం ప్రతినిధి బృందం మండలంలోని ఐకెపి, పీఏసీఎస్ దాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి,రైతుల సాధక,బాధకాలను అడిగి తెలుసుకున్నామని,రైతుల అవస్థలు చెప్పనలవి కాకుండా ఉన్నాయని,ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ధాన్య సేకరణలో క్షేత్రస్థాయిలో ధాన్యాన్ని పరిశీలించి గ్రేడేషన్(ఏ గ్రేడ్,బీ గ్రేడ్) నిర్ణయించాల్సిన అధికారులు,కేంద్రాల్లో ఉండకుండా ఎక్కడో ఏసీ రూముల్లో ఉండి రైతులకు, దాన్యానికి,తమ ప్రత్యక్ష పరిశీలనకు ఏమాత్రం సంబంధం లేకుండా గాలిలో గ్రేడ్లను నిర్ణయించి రైతులను నష్టాల పాలయ్యేలా,తమ దివాలాకోరు,పనితనాన్ని ప్రదర్శిస్తున్నరని,రైతులకు అర్థం కాని దిక్కుమాలిన పనివిదానాన్ని అవలంబిస్తున్న ఆన్‌లైన్ సిస్టమ్ నిర్ధారణలను,నిర్ణయాలను,పర్మిషన్లు ఇచ్చే విధానాన్ని వెంటనే రద్దు చేయాలని.దీనివల్ల మిల్లులకు వెళ్ళిన తర్వాత తాలు,తేమ పేరుతో మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నరని ఆయన ఆరోపించారు.మిల్లులలో పేరుకపోయిన పాత నిల్వలను ఖాళీ చేయకుండా,సివిల్ సప్లై అధికారులు బాధ్యతారాహిత్యాన్ని ప్రదర్శిస్తున్నరని ఆయన తెలియజేశారు.మీనాక్షి మిల్లులో సుమారు 55 వేల టన్నుల పాత ధాన్యాన్ని తరలించకుండా నిల్వ ఉండడం కేంద్ర ప్రభుత్వ,సివిల్ సప్లై అధికారుల బాధ్యతారాహిత్యాన్ని తెలియ చేస్తున్నదని ఆయన దుయ్యబట్టారు.గత రెండు పంటలకు సంబంధించిన ఈ ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే బయటకు పంపేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.అప్పుడే కొత్త ధాన్యం దిగుమతికి అవకాశం ఉంటుందని అందుకు కేంద్రం చొరవ చూపాలని ఆయన సూచించారు.తీవ్రమైన ఎండలు దంచికొడుతున్న నేటి ప్రత్యేక పరిస్థితుల్లో,కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కనీస తాగునీరు,నీడ తదితర మౌలిక సదుపాయాల సౌకర్యం కూడా లేదు.తాత్కాలికంగా వేసిన పరదాలు ఏమాత్రం ఉపయోగపడటం లేదు.తాలు పట్టే మిషన్లు సరిగా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నరు.నిలిపివేసిన బోనస్ చెల్లింపులు లేవు,మిల్లుల వద్ద రైతుల నుండి వసూలు చేస్తున్న అదనపు దిగుమతి చార్జీలను వెంటనే నిలిపివేయాలి.రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా దొడ్డు మరియు సన్న రకం వడ్లకు క్వింటాల్‌కు 500 బోనస్ వెంటనే చెల్లించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మండలంలోని వివిధ కేంద్రాల దుస్థితిని ?సిపిఎం బృందం పరిశీలించి ఇచ్చిన నివేదిక ప్రకారం ఫతేపూర్ కేంద్రం తెరిచి 20 రోజులైనా కేవలం 1 లారీ (650 బస్తాలు) మాత్రమే వెళ్ళింది.లింగంపల్లి 15 రోజులు గడిచినా ఒక్క లారీ కూడా లోడ్ అవ్వలేదు.శ్రీపతిపల్లి కేవలం 1 లారీ (630 బస్తాలు)కొండాపూర్ 1 లారీ (650 బస్తాలు),మల్కాపూర్ 2,500 బస్తాలు లోడ్ అయిన 2 లారీలు ఇంకా మిల్లు వద్ద అన్ లోడ్ కాక ఆగిపోయాయి. వెంకటాద్రిపేట 4 లారీలు(2,500 బస్తాలు),మాత్రమే తరలించారు. ఒక్క రాజవరం మాత్రమే 7 లారీలు(4,500 బస్తాలు)తరలించి కొంత మెరుగ్గా ఉంది.మీనాక్షి మిల్లులో సుమారు 55 వేల టన్నుల ధాన్యం నిల్వ ఉందని,సివిల్ సప్లై అధికారులు స్పందించి ఆ నిల్వలను వెంటనే ఖాళీ చేయించి కేంద్రాల్లో మూలుగుతున్న దాన్యాన్ని తరలించాలని ఆయన డిమాండ్ చేశారు.యుద్ధప్రాతిపదికన రైతుల సమస్యలు పరిష్కరించని పక్షంలో తీవ్ర ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.

# నకిలీ విత్తనాలు, నిషేధిత గడ్డి మందు పై ప్రతిష్టమైన చర్యలు.

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**




ఆదిలాబాద్, ఏప్రిల్ : 29 ( తెలంగాణ వాణి ప్రతినిధి ) స్థానిక పోలీస్ ఏఆర్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ సిబ్బంది అందరితో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా నమోదైన నేరాలపై సమగ్రంగా సమీక్ష చేపట్టి, శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలపై అధికారులకు జిల్లా ఎస్పీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఎండాకాలం నేపథ్యంలో చెరువులు, వాగులు, నదుల వద్ద ఈతకు వెళ్లే యువతకు భద్రతా సూచనలు విస్తృతంగా చేరేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. లోతు తెలియని ప్రదేశాల్లో ఈతకు దిగకూడదని, మద్యం సేవించి నీటిలోకి వెళ్లడం వంటి ప్రమాదకర చర్యలను పూర్తిగా నివారించేలా ప్రజలకు చైతన్యం కల్పించాలని తెలిపారు. నకిలీ విత్తనాలు, నిషేధిత గడ్డి మందుల విక్రయాలపై కఠినంగా పర్యవేక్షణ కొనసాగించాలని, రైతులను మోసం చేసే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ వివాదాలకు సంబంధించి సమగ్ర అవగాహనతో, చట్టబద్ధంగా పరిష్కారాలు చూపేలా సిబ్బందికి శిక్షణ అందించారు. పోలీస్ స్టేషన్లలో సిబ్బంది పనితీరు మెరుగుపడేలా ఎస్హెచ్ఓలు పర్యవేక్షణ పెంచాలని, ప్రతి ఒక్కరికీ సమాన విధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లపై నిరంతర నిఘా కొనసాగిస్తూ, నేరాల నియంత్రణలో కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే రాత్రి సమయాల్లో గస్తీ మరింత బలోపేతం చేసి, అసాంఘిక కార్యకలాపాలు, గ్యాంబ్లింగ్ వంటి చట్టవిరుద్ధ చర్యలను, నేరాలను, ఆర్థిక నేరాలను అడ్డుకునేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లలో సిసిటిఎన్ఎస్, సిడిఓ, డయల్-100, బ్లూ కోర్ట్, స్టేషన్ రైటర్, రికార్డులు పెండింగ్స్ లేకుండా సమయానుకూలంగా నవీకరించాలన్నారు. నేరస్తుల ఫింగర్ ప్రింట్లను సేకరించి ఆన్లైన్‌లో నమోదు చేయడం ద్వారా కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాల్లో సిసిటివి కెమెరాల ఏర్పాటు కోసం ప్రజలను ప్రోత్సహిస్తూ, వాటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సెక్షన్ ఇన్‌చార్జిల విధులు సక్రమంగా అమలవుతున్నాయో లేదో సీఐ స్థాయి అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు (పరిపాలన) పి. మౌనిక , బి. సురేందర్ రావు ఓఎస్డీ, ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే , శిక్షణ ఐపీఎస్ రాహుల్ కాంత్, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్. జీవన్ రెడ్డి, కమతం ఇంద్రవర్ధన్ మరియు సిఐలు, ఆర్ ఐ లు, ఎస్ఐలు, డి సి ఆర్ బి, ఎన్ఐబి, ఐటి కోర్, పోలీసు కార్యాలయ సిబ్బంది, జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ భాషకు పట్టం కట్టిన తొలిదేవర




కరీంనగర్:ఏప్రిల్ 29 (తెలంగాణ వాణి) ప్రముఖకవి, కథకుడు,కాల మిస్ట్,సీనియర్ జర్నలిస్టు, తెరవే హైదరాబాద్ జంట నగరాల శాఖ అధ్యక్షులు తెలిదేవర భానుమూర్తి బుధవారం ఉదయం మృతిచెందారు. భానుమూర్తి 1953 జనవరి 16న భువన గిరిలో జన్మించారు. తెలిదేవర వెంకట్రావు,సీతమ్మ ఇతని తల్లిదండ్రులు ఇతడు యాదగిరిగుట్ట, ఆర్మూర్, భువనగిరిలో చదువుకున్నాడు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పి.జి.పట్టా తీసుకొన్నాడు. 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాడు. నాటి ఉద్యమకారులతో కలిసి నల్లగొండ జైల్లో ఉన్నాడు. అప్పటి నుంచే తెలంగాణ బాసలో కవితలు రాయడం మొదలు పెట్టాడు.ఆ కవిత లను 'ఊరోల్లు'పేరుతో సంకలనంగా తెచ్చాడు. ఉదయం దినపత్రికలో తెలంగాణ భాషలో రాజకీయ వ్యంగ్య రచనలకు శ్రీకారం చుట్టాడు.ఈయన ఎన్టీఆర్, చంద్రబాబు ప్రభుత్వాలపై సంధించిన 335 వ్యంగ్య బాణాలతో 'పలుకుబడి' పుస్తకంగా వెలువరించాడు. ఉదయం వారపత్రికలో 'చల్నేదో బాల్ కిషన్'శీర్షికన రాసిన వ్యంగ్య,హాస్య రచనలను అదే పేరుతో విశాలాంధ్ర ప్రచురణాలయం పుస్తకంగా వెలువరించింది. ఆంధ్రప్రదేశ్ మాస పత్రికలో ఇతడు రాసిన హాస్య రచనలు 'గిల్లిదండ' పేరుతో పుస్తకంగా వచ్చింది.ఆక్సిజన్ బార్, నెమ్లీక,గులేర్ కథా సంపుటాలు ఇతని కలం నుంచి వెలువడ్డాయి.ప్రస్తుతం తెలంగాణ రచయితల వేదిక హైదరాబాద్ జంటనగరాల శాఖ అధ్యక్షులుగా ఉన్నారు. వీరి మృతి తెలుగు సాహిత్యా నికి తీరనిలోటు.వీరి మృతికి సంతాపం తెలియజేస్తూ, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజే స్తున్నట్లు తెలంగాణ రచ యితల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కూకట్ల తిరుపతి తెలిపారు.

# హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌లో అమర వీరుల స్మారక బ్యారక్ సిబ్బంది విశ్రాంతి భవనాల ప్రారంభం

**కరీంనగర్ సిపి గౌస్ ఆలం**



హుజూరాబాద్:ఏప్రిల్ 29 (తెలంగాణ వాణి )పోలీస్ సిబ్బంది సంక్షేమం మరియు వారి వసతి సౌకర్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం శుక్రవారం హుజూ రాబాద్ పోలీస్ స్టేషన్ ఆవర ణలో నూతనంగా నిర్మించిన "అమరవీరుల స్మారక బ్యారక్ సిబ్బంది విశ్రాంతి భవనాన్ని" ప్రారంభించారు.ఈ సందర్భం గా పోలీసు కమీషనర్ మాట్లా డుతూ విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి గౌరవార్థం ఈ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. నిరంతరం ప్రజల రక్షణ కోసం శ్రమించే పోలీస్ సిబ్బందికి మెరుగైన వసతి,మౌలిక సదుపాయాలు కల్పించడం వల్ల వారు మరింత ఉత్సా హంతో విధులు నిర్వహిస్తా రని ఆయన పేర్కొన్నారు. సిబ్బంది ఆరోగ్యం మరియు సౌకర్యాల విషయంలో రాజీ పడకుండా,జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పని వాతావ రణాన్ని ఆధునీకరిస్తామని సీపీ హామీ ఇచ్చారు.తగిన వసతి సౌకర్యాలు ఉన్నప్పుడే అధికారులు అత్యవసర సమయాల్లో మరియు ప్రజలకు సేవ చేయడంలో మరింత సమర్థవంతంగా పనిచేయగలరని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో హుజూరా బాద్ ఏసీపీ వి.మాధవి,స్థానిక ఇన్స్పెక్టర్లు కరుణాకర్,శ్రీనివా స్, రామకృష్ణ,ఎస్సైలు ఆవుల తిరుపతి,స్వాతి, క్రాంతి లతో పాటు ఇతర పోలీసు అధికారులు మరి యు సిబ్బంది పాల్గొన్నారు.

# దూరదర్శిని' సినిమా కలిపింది ఇద్దరిని



సువిక్షిత్, గీతికా రతన్ జంటగా ఓ యదార్థ సంఘటన ఆధారంగా రూపొందుతోన్న ఫీల్‌గుడ్ లవ్ ఎంటర్‌టైనర్ 'దూరదర్శిని'. కలిపింది ఇద్దరిని ఉపశీర్షిక. కార్తికేయ కొమ్మి దర్శకత్వంలో వారాహ మూవీ మేకర్స్ పతాకంపై జయ శంకర్ రెడ్డి.ఎం, పాటిమీది సంతోష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. అన్ని పనులను పూర్తిచేసుకున్న ఈ చిత్రం మే 15న విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం చిత్రలహరి మీట్‌ను బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగాజెమిని సురేష్ మాట్లాడుతూ " చాలా ఒడిదుడుకులు దాటుకుని ఫైనల్‌గా రిలీజ్ డేట్‌కు వచ్చింది. మే 15న మీ మనసు అనే యాంటినాను దూరదర్శని వైపుకు త్రిప్పండి. మీ మనసులను హత్తుకునే సినిమా ఇది. ఈ సినిమా అందరికి మంచి పేరును తెస్తుంది. నాకు ఈ సినిమాలో డిఫరెంట్ పాత్రను ఇచ్చారు. తప్పకుండా అందరి పాత్రలతో పాటు నా పాత్ర కూడా అందరికి నచ్చుతుంది. ఇది మన ఇంటి పెరుగన్నం లాంటి సినిమా. అందరూ పల్లెటూరులో విహారించిన అనుభూతి కలుగుతుంది. అందరికి పాత జ్ఞాపకాలు గుర్తుకుతెస్తుంది' అన్నారు.దర్శకుడు కార్తికేయ మాట్లాడుతూ " అందరూ ఇది కేవలం లవ్‌స్టోరీ అనుకుంటున్నారు. కానీ ఈ చిత్రంలో తల్లిదండ్రులకు, యూత్‌కు, సమాజానికి నచ్చే అంశాలు ఉన్నాయి. అందరికి 90వ దశకం రోజులను గుర్తకు తెస్తుంది. అందరూ చిత్రలహరి ప్రోగ్రామ్ కోసం వేచి చూసిన రోజులు గుర్తుకు వస్తాయి. ఈ సినిమాలో మంచి ఎమోషన్ ఉంది. అందరి హృదయాలను హత్తుకుంటుంది. సినిమా చూసిన ప్రతి ఒక్కరికి వాళ్ల గోల్డెన్ డేస్‌లోకి తీసుకవెళుతుంది. సువిక్షిత్‌కు హీరోగా మంచి పేరును తీసుకొస్తుంది. ప్రముఖ వ్యక్తులు మా సినిమాను విడుదల చేయడం ఆనందంగా ఉంది. అందరూ మే 15న విడుదలవుతున్న మాసినిమాను ఆదరించాలని కోరుకుంటున్నాను అన్నారు. ఈ సినిమా పతాక సన్నివేశాలు అందర్ని ఆలోచింపజేస్తాయి. సినిమా చూసిన వచ్చిన తరువాత ఆ ఫీల్ మిమ్ములను వదిలివెళ్లదు' అన్నారు.హీరోయిన్ గీతికాదాస్ మాట్లాడుతూ " ఎంతో ఇష్టపడి చేసిన సినిమా ఇది. తప్పకుండా అందరి హృదయాలను మెలిపెడుతుంది. ఈ సమ్మర్‌లో చాలా కూల్ సినిమా ఇది. ఇలాంటి ప్రేమకథలు చాలా అరుదుగా వస్తాయి. తప్పకుండా తెలుగు ప్రేక్షకులకు ఈసినిమా నచ్చుతుంది' అన్నారు.హీరో సువిక్షిత్ మాట్లాడుతూ " అరుణాచలంలో గిరి ప్రదక్షిణ చేస్తున్నప్పుడు ఓ పెద్దాయన బిక్షాటన చేస్తూ కనిపించాడు. ఆయనతో మాట్లాడినప్పుడు ఆయన చెప్పిన లైఫ్ స్టోరియే సినిమా ఇది. ఆయన సొంత కొడుకు వల్ల ఆ పెద్దాయన బిక్షాటన చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది అనేది ఈ కథ. యదార్థ సంఘటన చుట్టు అల్లుకున్న కథ ఇది. ఈ సినిమా చూసి ఎడవకుండా ఉన్నా వాళ్ల లైఫ్‌ను నేను సెటిల్ చేస్తాను. దూరదర్శిని ఓ జంటను ఎలా కలిపింది అనేది కథ. ఇప్పుడు ఈ కథ గురించి చెబుతున్న నేను ఎమోషన్ అవుతాను. ఓ తండ్రికి మానసిక పరిస్థితి ఎందుకు అలా అయ్యింది? కొడుకు వల్ల బిక్షాటన ఎందుకు చేయాల్సిన వచ్చింది? అనేది ఈ చిత్ర కథ. ఈ సినిమా టికెట్‌తో పాటు ఖర్చీఫ్ కూడా ఫ్రీగా ఇస్తాం. ఎందుకు ఈ సినిమా చూసి ఎడ్వకుండావరూ ఉండలేరు' అన్నారు.లావణ్య రెడ్డి మాట్లాడుతూ ఈ సినిమా అందరికి థియేటర్‌లో మంచి ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. గోదావరి నేపథ్యంలో సాగే అందమైన ప్రేమకథ ఇది. మీరు తప్పనిసరిగా ఎంటర్‌టైన్ అవుతారు. ఓ ఫీల్‌గుడ్ ప్రేమకథను చూసిన అనుభూతి కలుగుతుంది' అన్నారు. ఈ సమావేశంలో నటుడు కిట్టయ్య, తేజ,బాలరాజు పాల్గొన్నారు.

# విలేకరి ప్రశ్నతో కన్నీటి పర్యంతమైన పాయల్ రాజ్ పుత్..



'ఆర్ఎక్స్ 100' ఫేమ్ పాయల్ రాజ్‌పుత్ ఓ సినిమా కార్యక్రమంలో కన్నీటిపర్యంతమయ్యారు. సాధారణంగా ఎంతో చలాకీగా, నవ్వుతూ కనిపించే ఆమె, ఓ విలేకరి అడిగిన వ్యక్తిగత ప్రశ్నకు తన భావోద్వేగాన్ని ఆపుకోలేకపోయారు. తండ్రిని గుర్తుచేసుకుని వేదికపైనే ఏడుస్తూ, ప్రెస్ మీట్ మధ్యలోనే వెళ్లిపోయారు. ఈ ఘటన పలువురిని కదిలించింది. వివరాల్లోకి వెళ్తే, సౌరభ్ ధింగ్రా హీరోగా నటిస్తున్న 'ఫస్ట్ టైం (01-01-01)' సినిమా ప్రమోషనల్ ఈవెంట్‌కు పాయల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మీడియా అడిగిన ఓ ప్రశ్నకు బదులిస్తూ ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. ఇటీవల ఎదుర్కొన్న కష్టాల గురించి, ముఖ్యంగా తన తండ్రి గురించి ప్రస్తావన రావడంతో ఆమె కన్నీళ్లు ఆపుకోలేకపోయారు. "నా రియల్ హీరో మా నాన్నే. వచ్చే నెలతో ఆయన చనిపోయి సంవత్సరం అవుతుంది," అంటూ కన్నీళ్లతో చెప్పారు. గతేడాది తన తండ్రి విమల్ కుమార్ రాజ్‌పుత్ క్యాన్సర్‌తో మరణించారని పాయల్ తెలిపారు. ఆయన మరణం తర్వాత తాను తీవ్రమైన డిప్రెషన్‌లోకి వెళ్లానని, దాని నుంచి బయటపడేందుకు చికిత్స కూడా తీసుకున్నానని వెల్లడించారు. తన తండ్రి తన సినిమాలను ఎంతో ఇష్టంగా చూసేవారని, బోల్డ్ సినిమా అయినప్పటికీ 'ఆర్ఎక్స్ 100'లో తన నటనను మెచ్చుకున్నారని గుర్తుచేసుకున్నారు. పక్కనే ఉన్న వారు ఓదార్చే ప్రయత్నం చేసినా, పాయల్ తన దుఃఖాన్ని అదుపు చేసుకోలేక వేదిక నుంచి కిందకు వెళ్లిపోయారు. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# 'రాక్షసపురం' మూవీ విడుదల మే 7న




ప్రముఖ నిర్మాణ సంస్థ క్రియేటివ్ కమర్షియల్స్ అధినేత, సీనియర్ నిర్మాత కేఎస్ రామారావు తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్న లేటెస్ట్ మూవీ 'రాక్షసపురం'. కన్నడలో సంచలన విజయం సాధించిన 'రాక్షసపుర' చిత్రానికి ఇది తెలుగు అనువాదం. ఈ చిత్రాన్ని మే 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు నిర్మాత కేఎస్ రామారావు అధికారికంగా ప్రకటించారు.?విభిన్నమైన నటనతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రాజ్ బి శెట్టి ఈ సినిమాలో పవర్‌ఫుల్ పోలీస్ ఇన్ స్పెక్టర్ పాత్రలో నటించారు. డాక్టర్ రవి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఒక ఉత్కంఠభరితమైన మర్డర్ మిస్టరీ థ్రిల్లర్. ఇన్వెస్టిగేషన్ డ్రామా నేపథ్యంలో సాగే కథనం ప్రేక్షకులను అడుగడుగునా థ్రిల్‌కు గురి చేస్తుంది.విడుదల తేదీ మార్పుపై నిర్మాత కేఎస్ రామారావు స్పందిస్తూ.."ఈ సినిమాలోని మేకింగ్ విలువలు, సస్పెన్స్ ఎలిమెంట్స్ నన్ను బాగా ఆకట్టుకున్నాయి. అందుకే ఎలాంటి రాజీ పడకుండా ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందించాలని నిర్ణయించుకున్నాం. సినిమాను మే 1న విడుదల చేయాలని ముందుగా అనుకున్నప్పటికీ, మరిన్ని మెరుగైన థియేటర్లు, గరిష్ట స్థాయిలో ప్రేక్షకులకు చేరువయ్యేలా చేసేందుకు వీలుగా మే 7న విడుదల చేస్తున్నాం. వేసవి సెలవుల దృష్ట్యా ఈ తేదీ సినిమాకు కలిసి వస్తుందని భావిస్తున్నాం." అని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఐపీఎల్ సందడి మరియు ఓటీటీల పోటీ ఉన్నప్పటికీ, కంటెంట్ బలంగా ఉన్న చిత్రాలను ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారని, 'రాక్షసపురం' కచ్చితంగా ఆ కోవలోకి వస్తుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేసింది.షోల వివరాలు: మే 7న విడుదల కానున్న ఈ చిత్రం కోసం ప్రత్యేకంగా ప్లాన్ చేస్తున్నామని, మార్నింగ్ మరియు మ్యాట్నీ షోలకు ప్రేక్షకుల నుంచి భారీ స్పందన వస్తుందని ఆశిస్తున్నట్లు డిస్ట్రిబ్యూటర్లు పేర్కొన్నారు.ట్రైలర్ అప్‌డేట్: త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను మరియు ఇతర ప్రోమోలను విడుదల చేసి ప్రమోషన్స్ వేగవంతం చేయనున్నారు.

# థియేటర్లలోకి ధనుష్ 'కర

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన కొత్త సినిమా 'కర' ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. తమిళంతో పాటు తెలుగులోనూ ఈ చిత్రం ఏకకాలంలో విడుదల కాబోతోంది. విఘ్నేష్ రాజా దర్శకత్వం వహించిన ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. 1991 గల్ఫ్ యుద్ధం నాటి పరిస్థితులు, దేశంలో ఏర్పడిన ఇంధన సంక్షోభం నేపథ్యంలో ఈ సినిమాను పీరియడ్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కించారు. ఇప్పటికే సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రానికి యు/ఏ సర్టిఫికెట్ జారీ చేశారు. సినిమా నిడివి 2 గంటల 41 నిమిషాలుగా ఖరారైంది. తెలుగులో ఈ సినిమాను విఘ్నేశ్వర ఎంటర్‌టైన్‌మెంట్స్, ఆర్ స్టార్ లాజిస్టిక్స్ పతాకాలపై సీహెచ్ సతీష్ కుమార్, రాజేష్ కుమార్ బొబ్బర విడుదల చేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ కూడా ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ధనుష్ స్వయంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'కర' ఒక సాధారణ వ్యక్తి అసాధారణ పరిస్థితుల్లో చిక్కుకున్న కథ అని, దర్శకుడు విఘ్నేష్ అద్భుతమైన ప్రతిభ ఉన్న వ్యక్తి అని ప్రశంసించారు. ఈ చిత్రంలో ధనుష్ సరసన మమితా బైజు హీరోయిన్‌గా నటించగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. వెల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ పతాకంపై ఇషారి కె. గణేష్ ఈ చిత్రాన్ని నిర్మించారు.




# 'ఖల్‌నాయక్ రిటర్న్స్'లో ఐటెం సాంగ్



సంజయ్‌దత్ నటించిన కల్ట్‌క్లాసిక్ 'ఖల్ నాయక్' చిత్రానికి ఇటీవలే సీక్వెల్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. 'ఖల్ నాయక్ రిటర్న్స్' పేరుతో ఇది తెరకెక్కనుంది. 'ఖల్ నాయక్'లోని 'చోళీ కే పీచే క్యా హై' పాట అప్పట్లో అత్యంత ప్రజాదరణ పొందింది. మాధురీ దీక్షిత్ నృత్యాలు యువతరాన్ని ఆకట్టుకున్నాయి. అదే సమయంలో ద్వంద్వార్థాలతో కూడిన పాట ఇదనే విమర్శలు కూడా వచ్చాయి. ఇదిలావుండగా.. తాజా సీక్వెల్‌లో ఈ పాటను రీమిక్స్ చేయబోతున్నారట. ఇందులో తమన్నా నర్తించనుందని ప్రచారం జరుగుతున్నది. ఇప్పటికే తమన్నా పలు చిత్రాల్లో ఐటెంసాంగ్స్ చేసిన విషయం తెలిసిందే. రెండేళ్ల క్రితం 'స్త్రీ-2' చిత్రంలో తమన్నా చేసిన 'ఆజ్ కి రాత్' ప్రత్యేక గీతం విశేష ఆదరణ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో 'ఖల్ నాయక్ రిటర్న్స్'లో ఆమె పేరునే పరిశీలిస్తున్నారని బాలీవుడ్ టాక్.



# అరుదైన గౌరవం

ప్రస్తుతం యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' షూటింగ్‌లో బిజీగా ఉంది అగ్ర కథానాయిక రష్మిక మందన్న. కేరళలో జరుగుతున్న తాజా షెడ్యూల్‌లో పోరాట ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. ఇదిలావుండగా త్వరలో రష్మిక మందన్న ఓ గ్లోబల్ ఈవెంట్‌లో సందడి చేయబోతున్నది. జపాన్‌లోని టోక్యోలో జరగనున్న గ్లోబల్ యానిమే అవార్డ్స్ వేడుకలో రష్మిక మందన్న ప్రజెంటర్‌గా వ్యవహరించనుంది. ప్రపంచవ్యాప్తంగా యానిమేషన్ రంగంలో అద్భుత ప్రతిభాపాటవాలు ప్రదర్శించిన సాంకేతిక నిపుణులతో పాటు సినిమాలకు గత పదేళ్లుగా ఈ అవార్డులను ప్రదానం చేస్తున్నారు. భారత్ నుంచి ఈ ఏడాది గ్లోబల్ యానిమే వేడుకలో పాల్గొంటున్న ఏకైక భారతీయ నటి రష్మిక మందన్న కావడం విశేషం. ఇదొక అరుదైన గౌరవమని అంటున్నారు. అయితే 2024లో జరిగిన గ్లోబల్ యానిమే ఈవెంట్‌లో కూడా రష్మిక మందన్న పాల్గొన్నది.

ఈ వేడుకలో భాగమైన తొలి భారతీయురాలిగా ఆమె రికార్డు సృష్టించింది. మరోమారు రష్మిక మందన్న ఈ గ్లోబల్ ఈవెంట్‌లో పాల్గొనడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com